# క్రైమ్ THE మిర్రర్®

Voice of Anti Corruption

హైదరాబాద్
8-5-2026
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:16
సంచిక: 48

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD


## కేంద్ర క్యాబినెట్ విస్తరణ!

### తెలుగు రాష్ట్రాల బిజెపి ఎంపీలకు ఛాన్స్

### భారీగా ఆశావహులు ..ఎవరి ప్రయత్నాల్లో వారు..

క్రైమ్ మిర్రర్, సెంట్రల్ డెస్క్: ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు వచ్చాయి. భారతీయ జనతా పార్టీ అనుకున్నది సాధించింది. ప్రధానంగా పశ్చిమ బెంగాల్ పై కాషాయ జెండా ఎగిరింది. అస్సాంలో మరోసారి పట్టు నిలుపుకుంది. పుదుచ్చేరిలో మరోసారి అధికారంలోకి రాగలిగింది. కేరళలో సైతం మూడు అసెంబ్లీ స్థానాలతో గౌరవప్రదమైన ఉనికిని చాటుకునే ప్రయత్నం చేసింది. అయితే మిగతా రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలపై ఇప్పుడు దృష్టి పెట్టింది భారతీయ జనతా పార్టీ. ఈ క్రమంలో కేంద్ర మంత్రివర్గ విస్తరణ చేపట్టి చాలా రాష్ట్రాలకు ప్రాతినిధ్యం కల్పించాలని నిర్ణయించింది. ఈనెల 16 తర్వాత కేంద్ర క్యాబినెట్ విస్తరించాలని ప్రధాని మోదీ నిర్ణయించారు. దీంతో తెలుగు రాష్ట్రాల్లో

2లో

## పిఠాపురం వర్మపై వేటు!

**టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి పదవి నుంచి తొలగింపు**

**ముగ్గురు నేతలతో కూడిన కమిటీ నియామకం**

**కూటమిలో విభేదాలకు కారణం కావడమే కారణం**

క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో: ఏపీలో కీలక రాజకీయ పరిణామం చోటుచేసుకుంది. కాకినాడ జిల్లా పిఠాపురం టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ వర్మపై



## మిషన్ తెలంగాణ!

**బెంగాల్ ఫలితం తర్వాత బిజెపి ఫోకస్ అదే**

**ప్రధాని నరేంద్ర మోడీ పర్యటనతో మారనున్న సీన్**



**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** బిజెపి తెలంగాణపై ఫోకస్ పెట్టిందా? పశ్చిమ బెంగాల్ గెలుపుతో తదుపరి టార్గెట్ తెలంగాణయేనా? 2028 అసెంబ్లీ

3లో

## కేసులన్నీ సీబీఐకే

**మొన్న కాళేశ్వరం..నిన్న విద్యుత్ కొనుగోళ్ల స్కాం**

**సీబీఐ విచారణ కోరుతూ లేఖ రాసిన రేవంత్ సర్కారు**

**ఏకకాలంలో బీఆర్ఎస్, బీజేపీకి చెక్ పెట్టే ప్రయత్నం**

**విచారణ జరిగితే గులాబీ పార్టీకి ఇబ్బందులు**

**జరపకపోతే రెండు పార్టీలు ఒకటేనన్న ప్రచారం**

**పదునైన వ్యూహాలు రచిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి**



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. రాజకీయంగా తెలివైన గేమ్ ఆడుతున్నారు. రాష్ట్రంలో బలంగా ఉన్న ప్రతిపక్షం బీఆర్ఎస్ ను, బలపడాలని ఆరాటపడుతున్న బీజేపీని ఒంటిచేత్తో నిలువరిస్తున్నారు. ఒకే దెబ్బకు రెండు పిట్టలు అన్నట్లుగా.. ఒకేసారి రెండు పార్టీలను ఇరుకున పెట్టే వ్యూహాలను అమలు చేస్తున్నారు. ముందుగా గత పదేళ్ల ప్రభుత్వాన్ని నడిపించిన బీఆర్ఎస్ నాయకత్వంపై అవినీతి పేరుతో కేసులు పెడుతూ, తిరిగి ఆ కేసులను సీబీఐతో దర్యాప్తు చేయించాలంటూ.. బంతిని కేంద్ర ప్రభుత్వ కోర్టులోకి నెడుతున్నారు. సీబీఐ విచారణ జరిపితే బీఆర్ఎస్ కు నష్టం కలిగేలా, విచారణ జరపకపోతే బీఆర్ఎస్, బీజేపీ ఒకటేనని ప్రచారం చేసేలా ప్రత్యేక వ్యూహం పన్నారు.

2లో

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో**

వాస్తవానికి రేవంత్ రెడ్డి సీఎం పదవి చేపట్టినప్పుడు చాలా మంది ఆయనను చులకనగా చూశారు. మహాసముద్రం లాంటి కాంగ్రెస్ లో, దురంధరులైన సీనియర్ నేతలను పక్కకు నెట్టి సీఎం కుర్చీలో కూర్చున్నా.. అది మూణ్నాళ్ల ముచ్చటే అవుతుందనుకున్నారు. కానీ, రాజకీయంగా అందరి అంచనాలనూ రేవంత్ రెడ్డి తలకిందులు చేశారు. ఇప్పుడు తనను ఎవరూ కదిలించలేని స్థితికి చేరారు. సొంత పార్టీని, ప్రభుత్వాన్నిపూర్తిగా తన నియంత్రణలోకి తెచ్చుకుంటున్నారు. ఇందులో భాగంగా పదవుల పంపకాన్ని మొదలుపెట్టారు. ఇప్పటికే కొన్ని నామినేటెడ్ పోస్టులను భర్తీ చేయగా,

## వివాదాల్లో పాడి కౌశిక్ రెడ్డి!

తెలంగాణ రాజకీయాల్లో పాడి కౌశిక్ రెడ్డి మరింత వివాదాస్పదం అవుతున్నారు. ఫైర్ బ్రాండ్ అనిపించుకునే క్రమంలో ఆయన రాజకీయ ప్రత్యర్థులపై నోరు పారేసుకుంటున్నారు. లేనిపోని వివాదాలు తెచ్చుకుంటున్నారు. తాజాగా ఆయన కార్యాలయం తో పాటు వాహనంపై దాడి చేశారు భారతీయ జనతా పార్టీ శ్రేణులు. కేంద్ర మంత్రి బండి సంజయ్ పై పాడి కౌశిక్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడంతో బిజెపి శ్రేణులు ఆగ్రహానికి గురయ్యాయి.

3లో

**తాజాగా బండి సంజయ్ పై అనుచిత వ్యాఖ్యలు**

**విరుచుకుపడిన బిజెపి శ్రేణులు**

**గతంలో సభలోనే సీనియర్ ఎమ్మెల్యేలపై హాట్ కామెంట్స్**

**గులాబీ పార్టీకి భారం అవుతున్న యువనేత**



**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో :** పాడి కౌశిక్ రెడ్డి క్యాంపు కార్యాలయం పై దాడి చేసే ప్రయత్నం చేశాయి. ఇది తెలంగాణలో హాట్ టాపిక్ గా మారింది. మరోవైపు ఈ ఘటనలో తప్పు ఒప్పులను పక్కన పెడితే.. పాడి కౌశిక్ రెడ్డి తీరుపై చర్చ జరుగుతోంది. కౌశిక్ రెడ్డి దూకుడుతో గులాబీ పార్టీకి ఇబ్బందులు వస్తున్నాయి అనేది విశ్లేషకుల మాట.

**గత కొద్ది రోజులుగా వివాదాలు..**

గత కొద్ది రోజులుగా పాడి కౌశిక్ రెడ్డి వ్యవహార శైలి వివాదాస్పదం అవుతూ వచ్చింది. ముఖ్యంగా కెసిఆర్ తో పాటు కేటీఆర్ దృష్టిలో పడేందుకు కౌశిక్ రెడ్డి రాజకీయ ప్రత్యర్థులపై విరుచుకుపడుతుంటారు అన్న టాక్ ఉంది. గతంలో అసెంబ్లీలో సీనియర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతుండగా పాడి కౌశిక్ రెడ్డి తుపాకీతో కాల్చిపడేస్తానంటూ చేసిన సైగలు వివాదానికి దారితీసాయి.

## షర్మిల వర్సెస్ రఘువీరారెడ్డి!

**రాజ్యసభ పదవి కోసం పోటాపోటీ**

**కర్ణాటక నుంచి కాంగ్రెస్ పార్టీ భర్తీ చేసే ఛాన్స్**

**ఒకరికి గ్యారెంటీ**



క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:

ఏపీలో కాంగ్రెస్ పార్టీ బలోపేతంపై ఫుల్ ఫోకస్ పెట్టింది హై కమాండ్. వచ్చే ఎన్నికల్లో ఏపీలో ప్రభావం చూపాలని భావిస్తోంది. అందుకు అన్ని రకాల ప్రయత్నాలు ప్రారంభించింది.

2లో



## తమిళనాడులో అదే ఉత్కంఠ!

**విజయ్ కు రెండోసారి కూడా గవర్నర్ తిరస్కరణ**

**118 మద్దతు లేఖలు చూపిస్తేనే ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానం**

క్రైమ్ మిర్రర్, సెంట్రల్ డెస్క్:తమిళనాడు రాజకీయాల్లో ఆసక్తికర పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రభుత్వ ఏర్పాటులో

## పదేళ్ల బిఆర్ఎస్ కన్నా రెండేళ్ల కాంగ్రెస్ బెటర్

**25 లక్షల మంది రైతులకు రూ.2 లక్షల చొప్పున రుణమాఫీ**

**బిఆర్ఎస్ నేతల విమర్శలు చూసి రైతులు నవ్వుకుంటున్నారు**

**రైతులు ఆర్థానికి వ్యవసాయం దిశగా అడుగులు వేయాలి**

**వరంగల్ రైతుమేళాలలో పాల్గొన్న మంత్రి తుమ్మల**

హనుమకొండ,మే7:బీఆర్ఎస్ పదేళ్లలో చేయలేని పనులను సీఎం రేవంత్‌రెడ్డి రెండేళ్లలోనే చేశారని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మొదటి ఏడాదిలోనే రాష్ట్రవ్యాప్తంగా



2లో

## కేరళ సీఎంగా సీకే వేణుగోపాల్!

**రేవంత్ రెడ్డి మార్క్ ఎంపిక**

**హై కమాండ్ కీలక బాధ్యతలు**

**ఢిల్లీకి తెలంగాణ సీఎం**



2లో



## బెంగాల్ సీఎంగా అగ్ని మిత్ర పాల్!

**మమతా బెనర్జీని ఢీకొట్టిన మహిళా నేత ..ప్రపంచ ప్రఖ్యాత ఫ్యాషన్ డిజైనర్ కూడా..**

**దీదీ తరువాత సమర్థవంతమైన మహిళ నేత ఎంపికతో సరికొత్త సంకేతం**

**మోదీ-షా ద్వయం వ్యూహం**

**క్రైమ్ మిర్రర్, సెంట్రల్ డెస్క్:** పశ్చిమ బెంగాల్ తదుపరి ముఖ్యమంత్రి ఎవరు? మమతా బెనర్జీ తర్వాత ఆ రాష్ట్రానికి సీఎం అయ్యేది ఎవరు? దేశవ్యాప్తంగా

2లో

## ప్రజా సమస్యలకు వందశాతం పరిష్కారం

**సమిష్టి పితో..ప్రజలకు జవాబుదారీతనం**

**పెట్టుబడుల కోసం 28 ఉత్తమ విధానాలు**

**సింగపూర్ పాలనా విధానంపై అధ్యయనం**

**మోడల్‌గా ఓ జిల్లాలో అమలు చేసి చూద్దాం**

**కలెక్టర్ల సదస్సులో సిఎం చంద్రబాబు దిశానిర్దేశం**



3లో

# కేసులన్నీ సీబీఐకే

(మొదటి పేజీ తరువాయి)

క్యాబినెట్ ప్రక్షాళన కూడా ఈ నెలలోనే చేపట్టే ప్రయత్నాల్లో ఉన్నారట. దీనికితోడు దూకుడుతో, పదునైన వ్యూహాలతో ప్రత్యర్థి పార్టీలను ఎదుర్కొనేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇందుకోసం కీలక కేసులన్నింటినీ సీబీఐకి అప్పగిస్తూ పక్కా ప్లాన్‌తో ముందుకెళ్తున్నారు. ఇలా ప్రతి కేసునూ సీబీఐకి అప్పగిస్తూ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు.

**బీజేపీని బీఆర్ఎస్ ఒక్కటేనంటూ..**

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అక్రమాలు జరిగాయని, వాటిని నిగ్గు తేల్చేందుకు సీబీఐ విచారణ జరపాలంటూ పది నెలల క్రితమే సీఎం రేవంత్ రెడ్డి ఆ సంస్థను కోరారు. రెండు నెలల క్రితం లేఖ కూడా రాశారు. అయితే తాము రాసి నెలలు గడిచిపోతున్నా..ఇప్పటివరకు సీబీఐ నుంచి రెస్పాన్స్ లేదంటూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీని బీఆర్ఎస్ తో కలుపుతూ విమర్శలు చేస్తున్నారు. దీనికితోడు తాజాగా రేవంత్ సర్కార్ మరో సంచలన నిర్ణయం తీసుకుంది. బీఆర్ఎస్ హయాంలో విద్యుత్ కొనుగోళ్లలో అక్రమాలు జరిగాయని, దీనిపై కూడా విచారణ జరపాల్సిందిగా సీబీఐకి అప్పగించాలని నిర్ణయించింది. దీనిపై త్వరలో సీబీఐ డైరెక్టర్‌ను కలిసి విచారణ కోరేందుకు సిద్ధమయింది. విద్యుత్ కొనుగోళ్లపై గతంలోనే జస్టిస్ ఎల్.నర్సింహా రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం కమిషన్ ను వేసింది. అయితే విచారణ సమయంలో కమిషన్ ఛైర్మన్ నిబంధనలకు విరుద్ధంగా..పక్షపాతంతో వ్యవహరిస్తున్నారని బీఆర్ఎస్ నేతలు కోర్టుకు వెళ్లడంతో..ఆయనను తప్పించి..జస్టిస్ లోకూర్ నేతృత్వంలో విచారణను పూర్తి చేసింది. ఇక ఇప్పుడు జస్టిస్ లోకూర్ ఇచ్చిన నివేదిక ఆధారంగా సీబీఐ విచారణ కోరాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకోవడం చర్చనీయాంశంగా మారింది.



**విద్యుత్ కుంభకోణంపై నా సీబీఐనే**

కాళేశ్వరంపై సీబీఐ విచారణ జరపాలన్న వినతిపై 10 నెలలు గడుస్తున్నా కేంద్ర ప్రభుత్వం నుంచి కనీస స్పందన లేదంటోంది రాష్ట్ర ప్రభుత్వం. అయినప్పటికీ, విద్యుత్ కుంభకోణంపై రేవంత్ మళ్లీ సీబీఐనే ఎంచుకోవడం వెనుక ప్రత్యేక వ్యూహం ఉందంటున్నారు. సీబీఐ భుజంపై తుపాకి పెట్టి..బీఆర్ఎస్, బీజేపీని టార్గెట్ చేయాలన్నదే రేవంత్ ప్లాన్ అని చెబుతున్నారు. కాళేశ్వరంతో పాటు..విద్యుత్ కొనుగోళ్ల కేసులో..కేంద్రం సీబీఐ విచారణకు అంగీకరిస్తే..గత ప్రభుత్వ పెద్దలు, బీఆర్ఎస్ చిక్కుల్లో పడుతుందని లెక్కలు వేసుకుంటున్నారట. ఒకవేళ సీబీఐ విచారణపై..కేంద్రం స్పందించకపోతే..బీజేపీ–బీఆర్ఎస్ మధ్య లోపాయికారీ ఒప్పందం, రహస్య స్నేహం ఉందని ప్రజల్లోకి తీసుకెళ్లడమే రేవంత్ అసలు ప్లాన్ అంటున్నారు. సీబీఐ విచారణ జరిగితే బీఆర్ఎస్ ఇరికిపోతుందని, విచారణ జరగకపోతే ప్రజల ముందు బీజేపీని దోషిగా నిలబెట్టొచ్చన్నది రేవంత్ రెడ్డి వ్యూహంగా చెబుతున్నారు.

# బెంగాల్ సీఎంగా అగ్ని మిత్ర పాల్!

దీనిపైనే చర్చ నడుస్తోంది. రకరకాల పేర్లు తెరపైకి వస్తున్నాయి. అయితే తాజాగా బిజెపి మహిళా నేత అగ్ని మిత్ర పాల్ పేరు తెరపైకి వచ్చింది. మమతా బెనర్జీ తర్వాత పశ్చిమ బెంగాల్ కు మహిళా నేతను సీఎం అభ్యర్థిగా నిలబెడితే బాగుంటుందన్న అభిప్రాయానికి బిజెపి పెద్దలు వచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే ఇప్పటికే ముఖ్యమంత్రి పదవి ఎంపిక కోసం హోం మంత్రి అమిత్ షా రంగంలోకి దిగారు. మమతా బెనర్జీ రూపంలో ప్రతిపక్షం ఉండడంతో గట్టినేతను రంగంలోకి దించేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలుస్తోంది.

**దూకుడు కలిగిన మహిళా నేత**

సువెందు అధికారి పేరు ప్రముఖంగా వినిపించింది ముఖ్యమంత్రి పదవి కోసం. ఆయనతోపాటు చాలామంది ఆశావహులు ఉన్నారు సీఎం పదవి కోసం. అయితే ఇప్పుడు అగ్ని మిత్రా పాల్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ఆమె కోసమే ఇప్పుడు చర్చ జరుగుతోంది. ఆమె కేవలం రాజకీయ నాయకురాలు మాత్రమే కాదు. అంతర్జాతీయ గుర్తింపు పొందిన ప్రఖ్యాత ఫ్యాషన్ డిజైనర్ కూడా. చిత్ర పరిశ్రమలోని ప్రముఖులకు డిజైనర్ గా పనిచేసి మంచి గుర్తింపు పొందారు. 2019లో భారతీయ జనతా పార్టీలో చేరారు. తక్కువ కాలంలోనే పార్టీలో కీలక నేతగా ఎదిగారు. ప్రస్తుతం ఆమె బెంగాల్ బిజెపి ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచారు. మమతా బెనర్జీ వంటి ఉద్దండు రాలిని ఢీకొనే క్రమంలో అగ్ని మిత్రా చూపిన దూకుడు బిజెపి హై కమాండ్ ను సైతం కొన్ని సందర్భాల్లో ఆశ్చర్యపరిచింది.

**అనూహ్య మార్పులు**

సాధారణంగా ఏదైనా రాష్ట్రంలో బిజెపి గెలిస్తే ముఖ్యమంత్రి పదవుల ఎంపికలో అనూహ్య నిర్ణయాలు ఉంటాయి. చాలా రాష్ట్రాల్లో ఈ పరిస్థితిని చూసి కూడా. అయితే ఇప్పుడు పశ్చిమ బెంగాల్ విషయంలో కూడా అందరి అంచనాలను తారుమారు చేస్తూ సీఎం పదవి ఎంపిక ఉంటుందన్న టాక్ నడుస్తోంది. గతంలో మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో కూడా అనుకోని పేర్లను తెరపైకి తెచ్చి అందర్నీ ఆశ్చర్యపరిచింది మోదీ– షా ద్వయం. ఇప్పుడు కూడా అగ్ని మిత్రా పాల్ ఎంపిక ద్వారా అటువంటి సంకేతం ఇవ్వాలని చూస్తోంది పశ్చిమబెంగాల్ విషయంలో బిజెపి హై కమాండ్. చూడాలి మరి ఏం జరుగుతుందో..

**ఆమెకు ధీటుగా..**

బెంగాల్ రాజకీయాల్లో మమతా బెనర్జీ దూకుడు గురించి తెలియంది కాదు. కాంగ్రెస్ పార్టీని విభేదించి ఒక ప్రాంతీయ పార్టీని ఏర్పాటు చేసుకున్నారు. దశాబ్దాల వామపక్షాల కోటను దించే క్రమంలో మమతా బెనర్జీ చూపిన దూకుడు ఇప్పటికీ కళ్ళ ముందు కదలాడుతూ ఉంటుంది. అక్కడ బాగా వేయాలన్న బిజెపి ప్రయత్నాలను సైతం ఆమె చిత్తు చేశారు. ఇప్పుడు ఓటమి ఎదురైన తాను ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయనని ఆమె సవాల్ చేస్తున్నారు. అటువంటి బలమైన మహిళ నేత స్థానంలో.. మరో సమర్థవంతమైన మహిళ నేతను ఉంచడం ద్వారా బెంగాల్ ఓటర్లకు బలమైన సంకేతం ఇవ్వాలని ప్రధాని నరేంద్ర మోడీతో పాటు అమిత్ షా భావిస్తున్నారు. మమతా బెనర్జీ పై నిరంతరం అగ్ని మిత్ర పాల్ పోరాటం చేసిన విషయాన్ని గుర్తిస్తున్నారు. ఆమెలో జాతీయ భావజాలంతో పాటు బెంగాలీ అస్తిత్వాన్ని ప్రతిబింబించేలా చాలా అంశాలు దాగి ఉన్నాయి. ఇప్పటికే చాలామంది సీనియర్లు ముఖ్యమంత్రి పదవి కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. వారందరినీ కాదని అగ్ని మిత్ర పాల్ కు అవకాశం ఇవ్వడం ద్వారా బెంగాల్ రాజకీయాల్లో సరికొత్త మార్పు తీసుకురావాలని బిజెపి హాయ్ కమాండ్ గట్టి ఆలోచనతో ఉంది.

# షర్మిల వర్సెస్ రఘువీరారెడ్డి!

అందులో భాగంగా ఏపీ నుంచి ఒక నేతకు రాజ్యసభకు పంపాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో ఇద్దరు నేతల మధ్య పోటా పోటీ ఉంది. ముఖ్యంగా పిసిసి అధ్యక్షురాలు షర్మిల పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. మరో మాజీ మంత్రి కి సైతం అవకాశం ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ భావిస్తున్నట్లు సమాచారం. అయితే ముందు వరుసలో మాత్రం వైయస్ షర్మిల ఉన్నారు.

**రాజ్యసభ పదవులు ఖాళీ..:** జూన్లో దేశవ్యాప్తంగా 70 మందికి పైగా రాజ్యసభ సభ్యులు పదవీ విరమణ చేయనున్నారు. ఏపీ నుంచి నలుగురు సభ్యులు పదవీ విరమణ చేస్తారు. అలాగే కర్ణాటక నుంచి ఓ నలుగురు సభ్యులు రిటైర్ కానున్నారు. వారి స్థానంలో కొత్త వారి ఎన్నిక అనివార్యం. అయితే కర్ణాటకలో కాంగ్రెస్ అధికారంలో ఉంది. 135 అసెంబ్లీ స్థానాల్లో ఆ పార్టీ గెలుపొందింది. ప్రధాన ప్రతిపక్షంగా బిజెపి ఉంది. జెడిఎస్ సైతం ఓ 19 సీట్లలో విజయం సాధించింది. కర్ణాటక నుంచి మల్లికార్జున్ ఖర్గేతో పాటు దేవే గౌడ, మరో ఇద్దరూ పదవీ విరమణ చేయనున్నారు. ఇప్పుడు ఉన్న పరిస్థితుల దృష్ట్యా.. కాంగ్రెస్ పార్టీకి మూడు రాజ్యసభ స్థానాలు.. బిజెపికి ఒకటి దక్కే అవకాశం ఉంది. అయితే కర్ణాటక నుంచి ఏపీకి చెందిన నేతను రాజ్యసభకు పంపించాలన్నది కాంగ్రెస్ పార్టీ ఆలోచనగా తెలుస్తోంది.

**షర్మిల కు ఛాన్స్ :** ఏపీ నుంచి పంపించాలనుకుంటే పిసిసి అధ్యక్షురాలిగా ఉన్న షర్మిలకు ఛాన్స్ ఇస్తారని తెలుస్తోంది. 2024 ఎన్నికలకు ముందు ఆమె కాంగ్రెస్ సారధ్య బాధ్యతలు తీసుకున్నారు. అయితే అప్పట్లో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయాలనుకున్నారు. కానీ ఏపీలో కాంగ్రెస్ పగ్గాలు తీసుకుంటే రాజ్యసభకు చాన్స్ ఇస్తామని అప్పట్లోనే ఆమెకు హామీ ఇచ్చినట్లు ప్రచారం నడుస్తోంది. ఆ హామీ మేరకు ఇప్పుడు ఆమెను కర్ణాటక నుంచి రాజ్యసభకు పంపిస్తారని సమాచారం. కర్ణాటక కాంగ్రెస్ పార్టీ నేతలతో మంచి సంబంధాలు ఉన్నాయి షర్మిలకు. ఆమె అక్కడి డిప్యూటీ సీఎం శివకుమార్ ఆశీస్సులతోనే ఏపీ పగ్గాలు తీసుకున్నట్లు అప్పట్లో వార్తలు వచ్చాయి. కచ్చితంగా ఆయన సహకారంతో కర్ణాటక నుంచి రాజ్యసభకు షర్మిల వెళ్తారని జోరుగా ప్రచారం నడుస్తోంది.

**రఘువీరా పేరు పరిశీలన..:** మరోవైపు మాజీ మంత్రి, ఏఐసీసీ మెంబర్ ఎన్ రఘువీరారెడ్డి పేరు కూడా ప్రముఖంగా వినిపిస్తోంది. ఆయన కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నేత. సుదీర్ఘకాలం అదే పార్టీలో కొనసాగారు. ఏ పార్టీ వైపు కూడా తొంగి చూడలేదు. 1989లో తొలిసారిగా కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అయ్యారు. అదే సమయంలో మంత్రిగా కూడా పదవీ బాధ్యతలు చేపట్టారు. 2014 వరకు ఈ రాష్ట్రానికి మంత్రిగా ఉండేవారు. అయితే రాష్ట్ర విభజనతో కాంగ్రెస్ పార్టీ పరిస్థితి మారింది. ఆ సమయంలో పార్టీ పగ్గాలు తీసుకున్నారు రఘువీరారెడ్డి. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం గట్టిగానే కృషి చేశారు. ఆయన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ప్రాంతాల్లో కాంగ్రెస్ పార్టీ గెలిచింది. అందుకే ఇప్పుడు కర్ణాటక ద్వారా రాజ్యసభకు ఆయనను పంపిస్తారన్న ప్రచారం జరుగుతోంది. అయితే షర్మిల, రఘువీరారెడ్డి లో ఒకరికి రాజ్యసభ పదవి ఖాయమని తెలుస్తోంది. చూడాలి మరి ఏం జరుగుతుందో.

# కేంద్ర క్యాబినెట్ విస్తరణ!

(మొదటి పేజీ తరువాయి)

ఆశావహుల సంఖ్య పెరుగుతోంది.

**ఏపీకి ఒక మంత్రి పదవి..**

ఏపీ నుంచి కూటమిలో భాగంగా మూడు పార్లమెంటు స్థానాలను దక్కించుకుంది భారతీయ జనతా పార్టీ. పొత్తులో భాగంగా ఆరు పార్లమెంట్ స్థానాలకు పోటీ చేయగా.. మూడు స్థానాల్లో విజయం సాధించింది ఆ పార్టీ. అనకాపల్లి నుంచి సీఎం రమేష్, రాజమండ్రి నుంచి దగ్గుబాటి పురందేశ్వరి, నరసాపురం నుంచి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ బిజెపి తరఫున గెలిచారు. అయితే అనూహ్యంగా ఆర్ఎస్ఎస్ అండదండలతో భూపతి రాజు శ్రీనివాస వర్మ కేంద్ర క్యాబినెట్లో చోటు దక్కించుకున్నారు. అయితే ఇప్పుడు మంత్రివర్గ విస్తరణ జరిగితే దగ్గుబాటి పురందేశ్వరికి పదవి ఖాయమన్న ప్రచారం నడుస్తోంది. అయితే సీఎం రమేష్ కూడా ఆశావహుడిగా ఉన్నారు. ఆయనకు సైతం చాన్స్ ఇచ్చే పరిస్థితి కనిపిస్తోంది.

**తెలంగాణకు రెండు..**

తెలంగాణలో భారతీయ జనతా పార్టీ నుంచి ఎనిమిది మంది గెలిచారు. ఇద్దరినీ కేంద్ర క్యాబినెట్ లో తీసుకున్నారు. సికింద్రాబాద్ నుంచి గెలిచిన కిషన్ రెడ్డి తో పాటు కరీంనగర్ నుంచి గెలిచిన బండి సంజయ్ కు ఛాన్స్ దక్కింది. అయితే ఈటెల రాజేందర్ తో పాటు ధర్మపురి అరవింద్ వంటి వారు కూడా పదవులు ఆశిస్తున్నారు. మంత్రివర్గ విస్తరణలో ఛాన్స్ తప్పకుండా తెలంగాణకు లభించనుంది. ఎందుకంటే 2028లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి తెలంగాణలో. కేంద్ర క్యాబినెట్ విస్తరణ జరిగితే రెండు మంత్రి పదవులు తెలంగాణకు కేటాయించడం ఖాయం అన్న టాక్ నడుస్తోంది. అయితే ఒక్క ఈటెల రాజేందర్, ధర్మపురి అరవింద్ మాత్రమే కాదు.. మిగతా నలుగురు ఎంపీలు కూడా తమ ప్రయత్నాల్లో ఉన్నట్లు తెలుస్తోంది. మరి బిజెపి హై కమాండ్ ఎంతవరకు పరిగణలోకి తీసుకుంటుందో చూడాలి.

# కేరళ సీఎంగా సీకే వేణుగోపాల్!

(మొదటి పేజీ తరువాయి)

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో :** కేరళలో తదుపరి కాంగ్రెస్ సీఎం ఎంపిక కసరత్తు ప్రారంభం అయింది. అయితే ఈ బాధ్యతను తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పై కాంగ్రెస్ హై కమాండ్ పెట్టినట్లు తెలుస్తోంది. కేరళలో కాంగ్రెస్ కూటమి గెలుపు వెనుక సీఎం రేవంత్ రెడ్డి కృషి ఉంది. అక్కడ సుడిగాలి పర్యటన చేసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. అధికార పార్టీపై విరుచుకుపడిన క్రమంలో.. అక్కడ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేందుకు అనుకూల వాతావరణం ఏర్పడింది. కాంగ్రెస్ హై కమాండ్ సైతం కేరళ గెలుపు వెనుక రేవంత్ కృషి ఉంది అని బలంగా నమ్ముతోంది. అందుకే అక్కడ ముఖ్యమంత్రి ఎంపిక బాధ్యతను రేవంత్ రెడ్డికి అప్పగించినట్లు పొలిటికల్ వర్గాల్లో ప్రచారం సాగుతోంది.

**ఆశావాహులు అధికం..**

సాధారణంగా ఏదైనా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ గెలిస్తే ముఖ్యమంత్రి పదవి కోసం విపరీతమైన పోటీ ఉంటుంది. ప్రస్తుతం కేరళలో కూడా అదే పరిస్థితి ఉంది. చాలామంది సీనియర్లు ఆశావహులు ఉన్నారు. సీనియర్ నేతలు కేసు వేణుగోపాల్, సతీశన్, ఎంపీ శశిధరూర్ పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. ప్రస్తుతం సతీశన్ ముందు వరసలో ఉన్నట్లు ప్రచారం నడుస్తోంది. 2001 నుంచి ఆయన గెలుస్తూనే ఉన్నారు. దీంతో ఆయన వైపే యు డి ఎఫ్ మిత్రపక్షం ఆల్ ఇండియా ముస్లిం లీగ్ మొగ్గు చూపుతున్నట్లు ప్రచారం నడుస్తోంది.

**హస్తినలో కీలక మంతనాలు..**

అయితే ఇప్పుడు ప్రధానంగా కేసి వేణుగోపాల్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ఆయన తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్చార్జి కూడా. మరోవైపు శశిధరూర్ కూడా సీనియర్ నేతగా కేరళ నుంచి కొనసాగుతూ వచ్చారు. కానీ హై కమాండ్ ఆయన విషయంలో బ్రేక్ వేసినట్లు ప్రచారం నడుస్తోంది. అయితే ఇప్పుడు కాంగ్రెస్ హై కమాండ్ ప్రముఖంగా ఆ బాధ్యతను తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పై పెట్టినట్లు ప్రచారం జరుగుతోంది. ఆయన తీరుతోనే కేరళలో కాంగ్రెస్ కూటమి పుంజుకున్నట్లు హై కమాండ్ కు నివేదికలు ఉన్నాయి. అయితే రేవంత్ మాట చెల్లుబాటు అయితే మాత్రం ఆయన కేసి వేణుగోపాల్ కు జై కొట్టె అవకాశం ఉంది. ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ బాట పట్టారు. కేరళలో ముఖ్యమంత్రి పదవి ఎంపిక కోసమే ఆయనను ఢిల్లీ హై కమాండ్ పిలిచినట్లు ప్రచారంలో ఉంది. అయితే దీనిపై విపరీతమైన చర్చ నడుస్తోంది. మరి కేరళలో సీఎం పదవి ఎవరికి దక్కుతుందో చూడాలి.

# పదేళ్ల బిఆర్ఎస్ కన్నా రెండేళ్ల కాంగ్రెస్ బెటర్

25 లక్షల మంది రైతులకు రూ.2 లక్షల చొప్పున రుణమాఫీ చేశారని చెప్పారు. రైతులందరూ ఆర్గానిక్ వ్యవసాయంపై దృష్టి పెట్టాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యాఖ్యానించారు. రసాయనాల వాడకాన్ని తగ్గించకపోతే వ్యవసాయమే ప్రశ్నార్థకంగా మారుతుందని పేర్కొన్నారు. గురువారం హనుమకొండలో జరిగిన రైతుమేళాలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొని మాట్లాడారు. హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి రైతు మేళాలో తుమ్మల పాల్గొన్నారు. బీఆర్ఎస్ నేతలు వరంగల్ సభలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డిపై చౌవకబారు వ్యాఖ్యలు చేశారని ధ్వజమెత్తారు. రుణమాఫీపై కేటీఆర్ అండ్ కో అసత్యాలు మాట్లాడుతున్నారని ఆగ్రహించారు. రుణమాఫీపై మాట్లాడే నైతిక హక్కు బీఆర్ఎస్‌కి లేదని చెప్పుకొచ్చారు. కేసీఆర్ హయాంలో రైతుబంధు ఎగ్గొడితే సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చారని ప్రస్తావించారు. యుద్ధం వల్ల యూరియా ఆగిపోయినా మన రైతులకు యూరియా అందించామని మంత్రి తుమ్మల తెలిపారు. యూరియాపై మాట్లాడే నైతిక హక్కు బీఆర్ఎస్‌కు లేదన్నారు.



# తమిళనాడులో అదే ఉత్కంఠ!

సందిగ్ధత కొనసాగుతోంది. క్షణక్షణానికి తమిళనాడు రాజకీయాలు మారుతున్నాయి. టీవీకే అధినేత విజయ్ కు ప్రభుత్వ ఏర్పాటులో గవర్నర్ నుంచి అనుమతి లభించడం లేదు. గురువారం మరోసారి విజయ్ లోక్ భవన్ కు వెళ్లి గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ ను కలిశారు. తమిళనాడులో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి.. అసెంబ్లీలో మెజారిటీ నిరూపించేందుకు అవకాశం ఇవ్వాలని కోరారు. కానీ అందుకు అంగీకరించలేదు గవర్నర్. దీంతో రెండోసారి విజయ్ కు గవర్నర్ నుంచి అనుమతి లభించకపోవడం హాట్ టాపిక్ అవుతోంది.

**ప్రెస్ నోట్ విడుదల..**

రెండుసార్లు విజయ్ ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చిన క్రమంలో.. గవర్నర్ కార్యాలయం నుంచి ఒక ప్రెస్ నోట్ విడుదలైంది. తగినంత మెజారిటీ చూపించకపోవడంతోనే ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానం పలకలేదని దాని సారాంశం. మెజారిటీతో వస్తే కచ్చితంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు ఆహ్వానిస్తామని గవర్నర్ కార్యాలయ వర్గాలు పూర్తి స్పష్టతనిచ్చాయి. దీంతో తమిళనాడు రాజకీయాల్లో.. ముఖ్యంగా కొత్త ప్రభుత్వం ఏర్పాటులో సందిగ్ధత కొనసాగుతోంది. అయితే గవర్నర్ అనుమతి ఇవ్వకపోవడం పై అనేక రకాల విమర్శలు వస్తున్నాయి. వివిధ రంగాల ప్రముఖులు దీనిని తప్పుపడుతున్నారు. కమల్ హాసన్ తో పాటు ప్రకాష్ రాజ్ లాంటి సినిమా నటులు అయితే ఇది ప్రజాస్వామ్యానికి మంచిది కాదు అని వ్యాఖ్యానిస్తున్నారు.

**అతిపెద్ద పార్టీగా అవతరించినా**

ఈ ఎన్నికల్లో విజయ్ నేతృత్వంలోని టీవీకే 108 స్థానాలను గెలుచుకొని అతిపెద్ద పార్టీగా నిలిచింది. కాంగ్రెస్ పార్టీ మద్దతు ప్రకటించడంతో.. ఆ పార్టీకి చెందిన ఐదుగురు ఎమ్మెల్యేలతో కలుపుకుంటే విజయ్ బలం 113 కు చేరుకుంది. అయితే అది అంతటితో ఆగిపోయింది. మరోవైపు విజయ్ పోటీ చేసిన రెండు స్థానాల్లోనూ గెలిచారు. అందులో ఒకటి వదులుకోవాల్సి ఉంటుంది. అదే జరిగితే టీవీకే బలం 107కు పడిపోనుంది. అంటే టీవీకే కూటమి బలం 112 తో ఆగిపోనుంది. ఇంకా ఆరుగురు సభ్యులు మద్దతు అవసరం. అయితే మద్దతు పలికే ఇతర ఎమ్మెల్యేలు లేఖలు ఇవ్వకపోవడంతో గవర్నర్ ప్రమాణస్వీకారానికి గ్రీన్ సిగ్నల్ ఇవ్వలేదు.

**పెరుగుతున్న డిమాండ్లు..**

అయితే విజయ్ టీవీకే పార్టీని ప్రభుత్వం ఏర్పాటు దిశగా గవర్నర్ అనుమతించాలన్న డిమాండ్ తమిళనాడు సమాజంలో పెరుగుతోంది. అతిపెద్ద పార్టీగా అవతరించిన విజయ్ ను ముందుగా ప్రమాణస్వీకారానికి ఆహ్వానించాలని.. మెజారిటీని నిరూపించుకోవడానికి అసెంబ్లీ వేదికగా అవకాశం ఇవ్వాలన్న డిమాండ్ పెరుగుతోంది. గవర్నర్ నివాసంలో కాదు.. అసెంబ్లీ ఫ్లోర్ పై మెజారిటీ నిరూపించుకుంటాం అని టీవీకే నేతలు చెబుతున్నారు. గవర్నర్ మద్దతు లేఖల కోసం పట్టుబడడం రాజ్యాంగ విరుద్ధం అని అభిప్రాయపడుతున్నారు. అయితే ఇప్పుడు తమిళనాడులో ప్రభుత్వ ఏర్పాటుకు గవర్నర్ అడ్డంకిగా నిలవడం దక్షిణాది రాష్ట్రాల్లో బలమైన చర్చ నడుస్తోంది. అయితే ఈ పరిస్థితిని రాజకీయంగా తమకు అనుకూలంగా మలుచుకోవాలని చూస్తున్నాయి.






# వివాదాల్లో పాడి కౌశిక్ రెడ్డి!

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పుడు ఈ ఏకంగా బిజెపి కేంద్రమంత్రి పై ఆయన అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఒక ఎమ్మెల్యేగా బాధ్యతాయుతమైన పదవిలో ఉండి.. సాటి నాయకులపై ఆయన విరుచుకుపడుతున్న తీరు విమర్శలకు తావిస్తోంది. అప్పట్లో కడియం శ్రీహరి పై చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఎథిక్స్ కమిటీ రంగంలోకి దిగింది. ఆయనపై వేటు పడుతుందన్న టాక్ అప్పట్లో వినిపించింది. ఇప్పుడు ఏకంగా కేంద్రమంత్రి పై అనుచిత వ్యాఖ్యలు చేయడంపై బీజేపీ శ్రేణులు మండిపడ్డాయి. అయితే పాడి కౌశిక్ రెడ్డి తీరుతో గులాబీ పార్టీకి ఇబ్బందులే అని టాక్ నడుస్తోంది.

**గతంలో చాలా ఘటనలు..**

పాడి కౌశిక్ రెడ్డికి వివాదాలు కొత్త కాదు. గత కొన్నేళ్లుగా ఆయన చాలా రకాలుగా వివాదాల్లో చిక్కుకుంటూ వస్తున్నారు. 2024లో విధి నిర్వహణలో ఉన్న ఎస్సై పై అనుచిత ప్రవర్తనతో కేసు నమోదయింది.



సమ్మక్క సారమ్మ జాతరలో ఒక పోలీస్ అధికారిని మతం పేరుతో దూషించారని ఆరోపణలు కూడా వచ్చాయి. అప్పట్లో ఆయన క్షమాపణలు చెప్పారు కానీ.. గులాబీ పార్టీకి చాలా రకాల డ్యామేజ్ జరిగింది. భార్య పుట్టినరోజు సందర్భంగా పవిత్రమైన యాదాద్రి ఆలయంలో ఫోటోషూట్ నిర్వహించి సోషల్ మీడియాలో పెట్టడం కూడా అప్పట్లో కౌశిక్ రెడ్డి పై విమర్శలు వచ్చాయి. 2025లో జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ తో కలెక్టరేట్ సమావేశంలోనే గొడవకు దిగారు. గత ఏడాది జూన్లో ఒక గ్రానైట్ వ్యాపారిని బెదిరించి 50 లక్షల రూపాయలు డిమాండ్ చేశారని ఆరోపణలు కూడా ఉన్నాయి. ఫిరాయింపు ఎమ్మెల్యేలను విమర్శించే క్రమంలో ఆయన వాడిన చీర గాజులు భాష పై కూడా మహిళా ప్రజాప్రతినిధులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇలా లేనిపోని వివాదాలతో గులాబీ పార్టీని ఇరకాటంలో పెడుతున్నారు పాడి కౌశిక్ రెడ్డి. కేవలం కేసీఆర్ తో పాటు కేటీఆర్ దృష్టిలో పడేందుకు.. పార్టీ అధికారంలో వచ్చిన తర్వాత మంత్రి పదవి దక్కించుకునే ప్రయత్నం అని తెలంగాణ పొలిటికల్ పండిట్స్ చెబుతున్నారు.

## ప్రజా సమస్యలకు వందశాతం పరిష్కారం

అమరావతి: ప్రజా సమస్యలను వంద శాతం పరిష్కరించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ప్రభుత్వ సేవలపై ప్రజలు సంతృప్తి చెందాలన్నారు. సచివాలయంలో ఏడో విడత కలెక్టర్ల సదస్సులో అధికారులకు చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. అందరం సమష్టిగా పని చేయాలని, ప్రజలకు జవాబుదారీగా ఉండాలని చెప్పారు. సరిగా పరిపాలించకపోతే ప్రజలు ఆమోదించే అవకాశం లేదని, ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఇదే విషయం స్పష్టమైందన్నారు. 'ప్రజా సంతృప్తే నాకు కొలమానం. ప్రస్తుతం రూ.9.74 లక్షల కోట్ల అప్పులు ఉన్నాయి. గత ప్రభుత్వం కేంద్ర ప్రాయోజిత పథకాల నిధులను దారి మళ్లించింది. దీంతో కేంద్రం నిధులు ఇవ్వడం ఆపేసింది. రాష్ట్రాన్ని పునర్నిర్మాణం చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చాం. గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి ఆగిపోయింది. అభివృద్ధి లేకుంటే సంపద లేదు.. సంపద లేకుంటే సంక్షేమం లేదు. రాయల్ ఎన్‌ఫీల్డ్ పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకురాగలిగాం. పెట్టుబడుల కోసం 28 ఉత్తమ విధానాలు తీసుకొచ్చాం. గ్రీన్ ఎనర్జీ, డేటా సెంటర్ పెట్టుబడులకు ఏపీ గమ్యస్థానంగా మారింది. దేశంలో ఉన్న అతిపెద్ద కంపెనీలన్నీ ఏపీలో ఏర్పాటు కాబోతున్నాయి. వారానికో కంపెనీ తీసుకొ స్తున్నాం. రోజుకో శంకుస్థాపన చేస్తున్నాం. ప్రజల కోసం పనిచేసే వ్యక్తులు ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని చంద్రబాబు అన్నారు.మంత్రుల సింగపూర్ పర్యటనపై జిల్లా కలెక్టర్ల సమావేశంలో ఇచ్చిన ప్రజెంటేషన్ తదితర అంశాలపై సీఎం చంద్రబాబు నాయుడు దిశానిర్దేశం చేశారు. నేర్చుకోవటం అనేది నిరంతర పక్రియ అని తెలిపారు.

# మిషన్ తెలంగాణ!

ఎన్నికల్లో గెలుపు కోసం వ్యూహాలు ప్రారంభించిందా? కేంద్ర నాయకత్వం వ్యూహాలను అమలు చేయనుందా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. జరుగుతున్న పరిణామాలు కూడా అలానే ఉన్నాయి.

**చారిత్రాత్మక విజయం..**

బెంగాల్లో చారిత్రాత్మక విజయాన్ని సొంతం చేసుకుంది భారతీయ జనతా పార్టీ. ఆ మరుక్షణం తన పూర్తి దృష్టిని తెలంగాణ పై మళ్లించినట్లు తెలుస్తోంది. బెంగాల్లో మమతా బెనర్జీ కోటలను బద్దలు కొట్టింది బిజెపి. ఆ ఉత్సాహంలో ఉన్నారు కమలనాథులు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో కాషాయ జండా ఎగురవేయడమే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. అయితే పశ్చిమ బెంగాల్ కంటే భిన్నమైన రాజకీయ వాతావరణం ఉంటుంది తెలంగాణలో. ఆ తేడాను అనుసరించి వ్యూహాలు రూపొందించగలిగితే తెలంగాణ బిజెపికి పట్టు చిక్కడం ఖాయం. ప్రస్తుతం దేశంలో 20 రాష్ట్రాల్లో బిజెపి అధికారంలో ఉంది. 9 రాష్ట్రాల్లో మాత్రమే ఇతరులు అధికారంలో ఉన్నారు. తెలంగాణలో పాగా వేసి ఆ సంఖ్యను తగ్గించుకోవాలని చూస్తోంది బిజెపి.

**ప్రధాని పర్యటన**

తెలంగాణపై వ్యూహంలో భాగంగా ప్రధాని నరేంద్ర మోడీ రాష్ట్రంలో కీలక పర్యటన చేయనున్నారు. ఈ నెల 10న ప్రధాని మోదీ హైదరాబాద్ పర్యటన బిజెపికి అత్యంత ప్రతిష్టాత్మకం. దాదాపు 8 వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. పరేడ్ గ్రౌండ్స్ లో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. అక్కడి నుంచి ఆయన ఎన్నికల శంఖారావాన్ని పూరించనున్నారు. పనిలో పనిగా ప్రధాని టూర్ లో బిజెపి నేతలకు దిశ నిర్దేశం చేయనున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా పార్టీలో అంతర్గత కలహాలకు చెక్ పెట్టే విధంగా ప్రధాని నరేంద్ర మోడీ పర్యటన ఉండనున్నట్లు సమాచారం. క్షేత్రస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసేలా ఆయన రోడ్డు మ్యాప్ ఉండనుందని బిజెపి వర్గాలు చెబుతున్నాయి.

**విభేదాలకు చెక్..**

తెలంగాణ బిజెపి నేతలు అభిప్రాయ భేదాలు, సమన్వయ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. పార్టీలో కొత్తగా వచ్చిన నేతలు, పాత నేతల మధ్య విభేదాల పర్వం కొనసాగుతోంది. పైగా రాష్ట్ర నాయకత్వం పై కొన్ని రకాల ఫిర్యాదులు కూడా ఉన్నాయి. అయితే పశ్చిమ బెంగాల్లో అలా కాదు. నేతలంతా ఏకతాటిపైకి వచ్చి మమతా బెనర్జీ పై గట్టి పోరాటం చేశారు. అక్కడ బూత్ స్థాయిలో కూడా పటిష్టమైన యంత్రాంగం నిర్మించారు. అదే పరిస్థితి తెలంగాణలో తేవాలన్నది బిజెపి హై కమాండ్ ఆలోచన. గ్రామీణ స్థాయిలో రైతుల సమస్యలు, నిరుద్యోగం వంటి అంశాలపై ప్రజల పక్షాన పోరాడేలా నాయకత్వాన్ని సిద్ధం చేయాల్సిన అవసరం బిజెపి పెద్దలపై ఉంది. కేవలం హిందుత్వ కార్డు పైనే ఆధారపడకుండా.. స్థానిక అంశాలను గౌరవిస్తూనే అభివృద్ధి అజెండాను ముందుకు తీసుకెళ్లాలి. గత కెసిఆర్ పాలనలో వైఫల్యాలను.. ప్రస్తుత కాంగ్రెస్ పార్టీలో ఎదురవుతున్న పరిణామాలను ఎండగడుతూ.. తెలంగాణ అభివృద్ధి చెందాలంటే బిజెపి అవసరం అని అక్కడి ప్రజలు గుర్తించేలా వ్యూహాల రూపొందించాల్సిన అవసరం ఉంది. అప్పుడే బిజెపికి మిషన్ తెలంగాణ సాధ్యం.

# పిఠాపురం వర్మపై వేటు!

వేటు పడింది. ఆయనను పార్టీ ఇన్చార్జి పదవి నుంచి తొలగిస్తూ హైకమాండ్ నిర్ణయం తీసుకుంది. దీంతో వర్మ ఒక్కసారిగా షాక్ కు గురయ్యారు. హై కమాండ్ నిర్ణయం పై ప్రెస్ మీట్ పెట్టి మాట్లాడారు. అధిష్టానం ఆదేశాల మేరకు నడుచుకుంటానని చెప్పుకొచ్చారు. ఈ పరిస్థితుల్లో తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. కన్నీటి పర్యంతం అవుతూ ప్రెస్ మీట్ నుంచి మధ్యలో లేచి వెళ్లిపోయారు.

**మంచి పట్టున్న నేత**

పిఠాపురం నియోజకవర్గంలో వర్మ మంచి పట్టు ఉన్న నేత. 2014లో టికెట్ దక్కకపోవడంతో ఇండిపెండెంట్ గా పోటీ చేసి గెలిచిన చరిత్ర ఆయనది. 2019లో జగన్ ప్రభంజనంలో ఓడిపోయారు కానీ.. నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీని బలోపేతం చేస్తూ ముందుకు సాగారు. 2024 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలిచిన నియోజకవర్గాల్లో పిఠాపురం ఒకటి అన్నంతగా తీర్చిదిద్దారు. అయితే 2024 ఎన్నికలకు ముందు పొత్తులో భాగంగా పవన్ కళ్యాణ్ పిఠాపురం నియోజకవర్గాన్ని కోరుకున్నారు. అయితే అప్పటికే వర్మ పోటీకి అన్ని విధాల సన్నాహాలు చేసుకున్నారు. పవన్ కోరడంతో వర్మతో పాటు టిడిపి శ్రేణులు అభ్యంతరం తెలిపాయి. అయితే పార్టీ అధినేత చంద్రబాబు సముదాయించారు. అధికారంలోకి వచ్చిన మరుక్షణం మంచి అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారు. పవన్ కళ్యాణ్ సైతం వర్మ సాయాన్ని కోరుకున్నారు. వర్మ సైతం మనస్ఫూర్తిగా పవన్ కళ్యాణ్ గెలుపు కోసం కృషి చేశారు. భారీ మెజారిటీతో గెలిచిన పవన్ కళ్యాణ్ కూటమి ప్రభుత్వంలో డిప్యూటీ సీఎం అయ్యారు.

**వర్మ వైఖరిలో మార్పు..**

ఎన్నికల ఫలితాలు వచ్చాక వర్మ వైఖరిలో స్పష్టమైన మార్పు వచ్చింది. ఇస్తామన్న ఎమ్మెల్సీ పదవి ఇవ్వలేదు. ఎప్పుడిస్తారో తెలియలేదు. సహజంగానే తీవ్ర అసంతృప్తికి గురైన వర్మ.. పిఠాపురం నియోజకవర్గంలో టిడిపిని కాపాడుకునే ప్రయత్నంలో జనసేనతో ఘర్షణ వైఖరి ప్రారంభించారు. అయితే రాష్ట్రస్థాయిలో కూటమి బలంగా ఉండాలన్న వ్యూహంలో భాగంగా నేరుగా పవన్ నియోజక వర్గం కావడంతో వర్మను ఎప్పటికప్పుడు కట్టడి చేస్తూ వచ్చింది టిడిపి హై కమాండ్. కానీ ఇటీవల ప్రోటోకాల్ పేరుతో తరచూ గొడవ పడుతున్నారు వర్మ. ఇందులో పార్టీ ప్రయోజనం కంటే వ్యక్తిగత ఇమేజ్ కోసం ఆయన పరితపిస్తున్నారని.. ఆయన తీరుతో కూటమికి ఇబ్బందికర పరిస్థితులు వస్తాయని హై కమాండ్ కు నివేదికలు వెళ్లాయి. అందుకే రాష్ట్రస్థాయి కార్యవర్గంలో వర్మకు చోటు ఇచ్చారు. నియోజకవర్గ ఇన్చార్జ్ పదవి నుంచి తప్పించారు. పిఠాపురంలో టిడిపి సమన్వయానికి ముగ్గురు నేతలతో కూడిన కమిటీ నియమించడంతో ఆ నియోజకవర్గ విషయంలో టిడిపి అంత సీరియస్ గా లేదని అర్థమవుతోంది.

**పవన్ అభ్యంతరం తోనే?**

పవన్ కళ్యాణ్ ఆదేశాలతోనే పిఠాపురంలో వర్మను తప్పించారన్న టాక్ ఉంది. అయితే నియోజకవర్గం అయినట్లు మరో ప్రచారం ఉంది. పిఠాపురం నియోజకవర్గంలో వేలి పెట్టకుండా ఉండేందుకు టిడిపి ఇన్చార్జి పదవి నుంచి ఆయనకు పక్కన పెట్టారు. అదే సమయంలో ఎమ్మెల్సీ వంటి పదవిని ఇచ్చి.. ఇక పిఠాపురం జోలికి వెళ్లకూడదు అనే షరతు పెట్టనున్నట్లు సమాచారం. ఇటీవల జనసేన నేతలతో వీధి పోరాటానికి దిగారు వర్మ. అంతకుముందు చంద్రబాబు ఫోటో పేరుతో ప్రోటోకాల్ రగడ చేశారు. డిప్యూటీ సీఎం పవన్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం కావడంతో టిడిపి హై కమాండ్ కూటమికి ఇబ్బందులు రాకుండా ఉండేందుకు.. వర్మపై వేటు వేసినట్లు తెలుస్తోంది. అయితే రాబోయే ఎన్నికలకు ముందు వర్మ తీవ్ర నిర్ణయం దిశగా అడుగులు వేసినా ఆశ్చర్యపోనవసరం లేదని పొలిటికల్ పండిట్స్ చెబుతున్నారు. చూడాలి మరి ఏం జరుగుతుందో.

# "కాంగ్రెస్ హామీలు గాలిలో కలిశాయి

**రైతు, నిరుద్యోగి, విద్యార్థి మోసపోయాడు: కోదాడ సభలో హరీష్ రావు ఫైర్"**

**"కాంగ్రెస్ పాలన ఎప్పుడెప్పుడు పోతుందా అని ప్రజలు ఎదురుచూస్తున్నారు:**

**"కోదాడలో బీఆర్ఎస్ శక్తి ప్రదర్శన... కార్యకర్తల్లో జోష్ నింపిన హరీష్ రావు"**






**కోదాడ మే 07 ( క్రైమ్ మిర్రర్):** కోదాడ మాజీ శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్ అధ్యక్షతన జరిగిన సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలో జరిగిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు పాల్గొన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనా వైఫల్యాలను ఎండగడుతూ, స్థానిక కాంగ్రెస్ నాయకత్వంపై ఆయన తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. భవిష్యత్తు బీఆర్ఎస్ దే అని స్పష్టం చేస్తూ కార్యకర్తల్లో ఉత్సాహం నింపారు. 2 లక్షల ఉద్యోగాలు, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, మహిళలకు రూ. 2500 ఇస్తామని చెప్పి నిరుద్యోగులు, విద్యార్థులు, రిటైర్డ్ ఉద్యోగులు.. ఇలా అన్ని వర్గాల ప్రజలను ఈ ప్రభుత్వం దారుణంగా మోసం చేసింది.ముస్లిం మైనారిటీలకు ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా నెరవేర్చలేదు. పైగా కేసీఆర్ మైనారిటీలకు ఇచ్చిన ప్రయోజనాలను సైతం రేవంత్ రెడ్డి ఆపేశాడు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరు.. బాత్ కరోడో మే.. కామ్ పకోడో మే అన్నట్లుగా ఉంది. మాటలు కోటలు దాటుతున్నాయి, చేతలు మాత్రం శూన్యం.ఎస్సీ, ఎస్టీలకు సబ్ ప్లాన్ నిధులు రావడం లేదు. ఎస్సీ-ఎస్టీ కార్పొరేషన్ల ద్వారా ఈ రెండున్నరేళ్ల పాలనలో ఏ ఒక్కరికీ ఒక్క రూపాయి లబ్ధి కూడా జరగలేదు.

కేసీఆర్ పాలనలో ఎంతో అభివృద్ధి జరిగింది. కాళేశ్వరం జలాలతో ఈ ప్రాంతంలోని పొలాలు పారాయి.గతంలో మంత్రిగా ఉన్న ఉత్తమ్ కుమార్ రెడ్డి ఏనాడైనా కోదాడకు గోదావరి జలాలను తీసుకురాగలిగారా? బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాకే ఎస్సారెస్పీ ఫేజ్-2 పూర్తి చేసి ఈ ప్రాంతానికి సాగునీరు అందించాం.ఎన్నికల్లో ఓడిపోయినా మాజీ ఎమ్మెల్యే మల్లయ్య యాదవ్ నిత్యం ప్రజల్లో ఉంటున్నాడు. కానీ గెలిచిన కాంగ్రెస్ ఎమ్మెల్యే మాత్రం కేవలం ఆన్లైన్ కే పరిమితమైంది. అసలైన నాయకుడు ఎవరో ప్రజలు అర్థం చేసుకోవాలి.పసలేని ఈ కాంగ్రెస్ పాలన ఎప్పుడెప్పుడు పోతుందా అని జనం ఎదురుచూస్తున్నారు. ప్రజలందరూ మళ్లీ కేసీఆర్ పాలన రావాలని బలంగా కోరుకుంటున్నారు.కరోనా కష్టకాలంలో కూడా కేసీఆర్ గారు రైతుబంధు ఆపలేదు. హమాలీలు దొరక్క వడ్ల కొనుగోళ్లు ఆగుతున్నాయంటే.. ఏకంగా బీహార్ నుంచి ప్రత్యేక రైళ్లలో కూలీలను తీసుకొచ్చి వడ్ల లోడ్లు దించిన గొప్ప నాయకుడు కేసీఆర్.ఆనాడు కరోనా సమయంలో 93 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లను కొన్న ఘనత కేసీఆర్ . ఈ యాసంగిలో 90 లక్షల మెట్రిక్ టన్నులు కొంటామని గొప్పలు చెప్పి.. ఇప్పటి వరకు కేవలం 17 లక్షల టన్నుల వడ్లను మాత్రమే కాంగ్రెస్ కొన్నది.కరోనా మనుషుల ప్రాణాలు తీస్తే.. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ఉసురుపోసుకుంటోంది. ప్రతిక్షణం రైతులను ఏడిపిస్తోంది.కాంగ్రెస్ పాలనలో రైతులకు అడుగడుగునా కష్టాలే. ఎరువు బస్తాల కష్టాలు, కరెంటు కష్టాలు, నీళ్ల కష్టాలు.. ఆఖరికి పండిన వడ్లు అమ్ముకోవాలన్నా కష్టాలు తప్పడం లేదు.యూరియా అమ్ముకోవడం చేతకాని ప్రభుత్వం.. మొన్నటి దాకా ఆన్లైన్ యాప్ లు పెట్టింది, ఇప్పుడు ఏకంగా యూరియా అమ్మకాల పైనే బ్యాన్ పెట్టి రైతులను గోస పెడుతోంది.

అస్తమానం ఢిల్లీ చుట్టూ తిరుగుతున్న రేవంత్ రెడ్డి.. ఒక్కసారైనా ఏసీ రూములు వదిలి వడ్ల కల్లాల దగ్గరికి వచ్చి రైతుల కష్టాలు వినాలి. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఐకేపీ కేంద్రాలకు వెళ్లి రైతుల బాధలు చూడాలి.అమాయకుడైన బీఆర్ఎస్ కార్యకర్త రాజేష్ ను ఈ కాంగ్రెస్ ప్రభుత్వం అన్యాయంగా పొట్టనబెట్టుకుంది.రేపు రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమే. అధికారంలోకి వచ్చాక ఆ లెక్కలన్నీ ముంగటేస్తాం, ప్రతి ఒక్కరి తాట తీస్తాం. హరీష్ రావు.

## ప్రజల విశ్రాంతికై బెంచీల ఏర్పాటు



బాలాపూర్ (క్రైమ్ మిర్రర్) జిహెచ్ఎంసి డివిజన్-57లో బోయపల్లి సత్తిరెడ్డి సత్యమ్మ, జగదీశ్వరి రామిరెడ్డి జ్ఞాపకార్థంగా అల్మాస్‌గూడలోని కోమటికుంట చెరువు చుట్టూ ప్రతిరోజూ వాకింగ్‌కు వచ్చే ప్రజలు విశ్రాంతి తీసుకునే విధంగా లక్ష ఇరవై వేల విలువైన సిమెంట్ బెంచీలను బోయపల్లి రాఘవేందర్ రెడ్డి ఏర్పాటు చేయించారు. అలాగే బిఆర్ఆర్ కాలనీ పార్క్ లో కూడా ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని బెంచీలను ఏర్పాటు చేయడం జరిగింది. ప్రజల సమస్యలను దగ్గరగా అర్థం చేసుకొని, అభివృద్ధి మరియు సేవే లక్ష్యంగా సామాజిక బాధ్యతతో ముందుకు సాగుతున్న బోయపల్లి రాఘవేందర్ రెడ్డి నాదర్గుల్ డివిజన్‌లో ప్రత్యేక గుర్తింపు పొందుతు రాజకీయాలు అంటే కేవలం పదవులు కాదు, ప్రజలకు ఉపయోగపడే పనులు చేయడమే అసలైన నాయకత్వమనే భావనతో ఆయన ముందుకు సాగుతు ప్రజల మధ్య నిత్యం ఉంటూ సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్న బోయపల్లి రాఘవేందర్ రెడ్డి కి డివిజన్ ప్రజలు అభినందనలు తెలిపారు.


GHMC
hmda Growing Global
TS-bPASS

MAKAM GANGADHAR NETHA
President (GHMC)
Telangana Building Planners Association
E-mail ID : sriswamiplanners@gmail.com



SRI SWAMI ASSOCIATES
ARCHITECTS • ENGINEERS • SURVEYORS
We Undertake Building Plans, Lay-Out Plans & Permissons, LRS, BRS, Tax Assesments
GHMC, HMDA, DTCP, TS-bpass, Layout, Building Permissions

వాస్తుకి బిల్డింగ్ ప్లానింగ్, నక్ష చేయబడును
డిజిటల్ లాండ్స్ సర్వే, లే-అవుట్లు,
నక్ష ప్లానింగ్ చేయబడును,
Auto DCR Online Up Loading, Pre DCR Cad Drawing
భవన నిర్మాణం దరఖాస్తు కొరకు సంప్రదించండి.

H.No. 11-5-565, Bhagya Laxmi Towers,
Opp: GHMC Circle Office,
Saroornagar, Hyderabad - 500035
Mob : 9393929595

## పాలమూరు--రంగారెడ్డి ప్రాజెక్టు సాధన సభను మహావిజయం చేద్దాం



బాలాపూర్ (క్రైమ్ మిర్రర్) చౌదర్ గూడ మండల కేంద్రములో టిఆర్ఎస్ పార్టీ నిర్వహించే పాలమూర్ - రంగారెడ్డి ప్రాజెక్ట్ సాధన సభా స్థలిని గురువారం తెలంగాణ రక్షణ సేన రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగా రెడ్డి, రాష్ట్ర మైనారిటీ విభాగం అధ్యక్షుడు మహమ్మద్ ముస్తఫా, నారాయణ్ పేట్ అధ్యక్షుడు గవినోళ్ళ శ్రీనివాస్, షాద్‌నగర్ నియోజకవర్గ ఇంచార్జ్ చీమల రమేష్, సమన్వయ కర్తలు చిలుక ప్రవీణ్ , శీలం వీరెందర్, చామర్తి శీతారామ్, నాయకులు శ్యామ్, శ్రవణ్ గౌడ్, శివరామకృష్ణా రెడ్డి తదితరులు పరిశీలించిన అనంతరం విలేఖరులతో వారు మాట్లాడుతూ తెలంగాణ బీడు భూములకు జీవం పోసి, దక్షణ తెలంగాణ రూపురేఖలను మార్చగల ఏకైక సంజీవని పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసి, మన బీడు భూముల్లో కృష్ణమ్మ పరవళ్లు తొక్కాలన్న సంకల్పంతో తెలంగాణ రక్షణ సేన వ్యవస్థాపక అధ్యక్షురాలు తలపెట్టిన "పాలమూరు--రంగారెడ్డి ప్రాజెక్టు సాధన సభ" కు రైతన్నలు యువకులు మహిళలు భారీ ఎత్తున తరలిరావాలని తెలంగాణ రక్షణ సేన పక్షాన మనస్ఫూర్తిగా ఆహ్వానిస్తున్నాము. ?తెలంగాణ అభివృద్ధి పథంలో ముందుకు సాగేందుకు ఈ మహాసభ ఒక కీలక ఘట్టం. ఈ సభను విజయవంతం చేయడానికి సమాజంలోని ప్రతి వర్గం కదలిరావాలని ఎండిన బీడు భూములను సస్యశ్యామలం చేసి, మన బతుకులను పచ్చగా మార్చేది సాగునీరే. మన పొలాలకు దక్కాల్సిన నీటి వాటా కోసం, భవిష్యత్తు తరాల కోసం మీరంతా ఏకమై ఈ సభలో గొంతు కలపాలి. తెలంగాణ ఉజ్వల భవిష్యత్తుకు యువతే వెన్నెముక. ప్రాజెక్టు పూర్తయితేనే ఈ ప్రాంతం వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో అభివృద్ధి చెంది, ఉపాధి అవకాశాలు మెండుగా లభిస్తాయి. నవసమాజ నిర్మాణానికి మీ అడుగులే మార్గదర్శకం కావాలి. మహిళలకు ?తాగునీటి గోస తీరాలన్నా, ఇంట సిరిసంపదలు వెల్లివిరియాలన్నా ఈ ప్రాజెక్టు ఎంతో అవసరం. మన నీటి హక్కు  మన భవిష్యత్తు మన బాధ్యత. ?నీటి కోసం మనమంతా ఒక్కటై పోరాడుదాం అని తెలిపారు.

# మృగాళ్ళు, మహిళ, మహానగరం

## అర్ధరాత్రి బస్టాండ్‌లో బట్టబయలైన మహానగర మనస్తత్వం

మే 5 వ తేదీ అర్ధరాత్రి నుంచి మే 6 వ తేదీ తెల్లవారుఝాము వరకు జరిగిన ఒక స్టింగ్ ఆపరేషన్, మన హైదరాబాద్ మహానగర సమాజంలోని చేదు వాస్తవాన్ని కళ్లకు కట్టింది. కొత్త ఫ్లైఓవర్లు, ఐటీ ఎగుమతులు, మెట్రో విస్తరణ, స్టార్టప్ విజయగాథలతో ప్రపంచ పటంలో నిలుస్తున్న హైదరాబాద్‌లో, అర్ధరాత్రి బస్టాండ్‌లో ఒంటరిగా నిలబడ్డ ఒక మహిళను దాదాపు 40 మంది యువకులు అసభ్యంగా వేధించడం కేవలం మరో నేరం కాదు - అది మన సామాజిక మనస్తత్వానికి అద్దం పట్టిన అసౌకర్యమైన ఉదంతం. మహిళా పోలీసు కమిషనర్ స్టింగ్ ఆపరేషన్‌లో భాగంగా, సాధారణ మహిళ ఆహార్యంలో అర్ధరాత్రి బస్టాండ్‌లో నిలబడ్డారు - మూడు గంటల వ్యవధిలో దాదాపు 40 మంది యువకులు అసభ్య వ్యాఖ్యలు, వేధింపులతో ఆమెను చుట్టుముట్టారు. పైగా, వారందరూ ఒకే గుంపుగా రాలేదు. ఇద్దరు, ముగ్గురు సభ్యులుగా 10-15 బృందాలుగా వచ్చారు. దాన్ని బట్టి, ఇదేదో ఒక అసాంఘికశక్తుల ముఠా పని కాదని, సమాజంలో విస్తృతంగా వ్యాపించిన జాడ్యమని అర్థమవుతోంది. ఇది నాగరికతకు దూరంగా ఉన్న అడవి లోనో, మారుమూల కుగ్రామం లోనో జరిగిన సంఘటన కాదు. మెట్రో రైళ్లు పరుగెత్తే, ఐటీ టవర్లు ధగధగలాడే, 'గ్లోబల్ సిటీ'గా వెలిగిపోయే హైదరాబాద్ నగరం నడిబొడ్డున జరిగిన సంఘటన. సైబర్ టవర్ల నీడలో కూడా ఆటవిక మనస్తత్వం బతికే ఉందని ఈ ఘటన గుర్తు చేస్తోంది. ఈ ఘటనలో అత్యంత ఆందోళనకరమైన విషయం ఆ యువకుల సంఖ్య కాదు; తమ ప్రవర్తనలో తప్పేమీ లేదన్న వారి ధీమా, 'ఇది మామూలే' అన్న అపాయకరమైన ఫ్యూడల్ మనస్తత్వం. ఆ యువకులు భయంతో, సంకోచంతో, అపరాధ భావంతో ప్రవర్తించలేదు. అత్యంత సహజంగా, రోజువారీ సంభాషణలా మాట్లాడారు. ఒక మహిళ రాత్రిపూట ఒంటరిగా కనిపించగానే ఆమె గౌరవం, స్వేచ్ఛ అన్నీ చెరిపేసి, కేవలం 'అవకాశం'గా చూడటమే అసలైన సంక్షోభం. 'రేట్ ఎంత?' అనే ప్రశ్నలో కేవలం అసభ్యత మాత్రమే కాదు; మహిళను మనిషిగా కాకుండా కొనుగోలు చేయదగిన వస్తువుగా చూసే వికృత సామాజిక దృష్టికోణం దాగి ఉంది.

మన నగరాలు ఆధునికమవుతున్నాయి. మెట్రో రైళ్లు పరుగెడుతున్నాయి. ప్రపంచ స్థాయి భవనాలు నిర్మితమవుతున్నాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ ఎకానమీ, గ్లోబల్ పెట్టుబడులు అంటూ మనం భవిష్యత్తు వైపు దూసుకుపోతున్నాం. కానీ మహిళల విషయంలో మనం ఇంకా ఆటవిక దశను దాటలేకపోతున్నాం. చీకటి పడితే చాలు, నాగరికత ముసుగు తొలగి లోపల దాగి ఉన్న మృగాళ్లు బయటపడుతున్నారు.

తెలంగాణ పోలీస్ వ్యవస్థ దేశవ్యాప్తంగా ప్రశంసలు పొందిన షీ టీమ్ లను ఏర్పాటు చేసింది. అధికారిక సమాచారం ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా 331 షీ టీమ్ లు, 31 భరోసా కేంద్రాలు ఒంటరి మహిళల, ముఖ్యంగా విద్యార్థినుల, ఉద్యోగినుల భద్రతే లక్ష్యంగా పనిచేస్తున్నాయి. అయినప్పటికీ, ఒక మహిళ కొన్ని గంటల్లోనే పదేపదే వేధింపులకు గురైతే, సమస్య కేవలం శాంతిభద్రతల వైఫల్యం కాదు; అది మహిళను చూసే సామాజిక దృష్టి లోని లోపం. హైదరాబాద్‌లో నిర్వహించిన ఒక అధ్యయనం ప్రకారం, రాత్రి వేళల్లో మెట్రో సేవలు ఉపయోగించే మహిళల్లో దాదాపు 70 శాతం మంది అసురక్షితంగా భావిస్తున్నారని వెల్లడైంది. 'సేఫ్ సిటీ' అనే భావన కేవలం సీసీ కెమెరాలు, యాప్‌లు, పహారా వాహనాలతో రాదు; మహిళ భయం లేకుండా నిలబడగలిగే సామాజిక సంస్కృతి, వారి పట్ల



గౌరవం ఉన్నప్పుడే అది సాకారమవుతుంది.

ఇంకా విషాదకరమైన విషయం ఏమిటంటే - ఇలాంటి ఘటనల తర్వాత కూడా మనలో కొందరు మొదటగా, మొరటుగా అడిగే ప్రశ్న: 'ఆమె అంత రాత్రి అక్కడ ఎందుకు ఉంది?'. నేరస్తుడి ప్రవర్తనను నిగ్గదీసే బదులుగా మహిళ స్వేచ్ఛను ప్రశ్నించడం, బాధితురాలి పైనే నైతిక విచారణ జరపడం మన సమాజంలో ఇంకా బలంగా ఉంది. ఈ ప్రశ్న ఇప్పుడు మరింత కీలకం. ఎందుకంటే ఒకవైపు ప్రభుత్వాలు మహిళా సాధికారత గురించి గొప్పగా మాట్లాడుతున్నాయి. మహిళలను ఉద్యోగాల్లోకి తీసుకురావాలని, ఆర్థిక వ్యవస్థలో భాగస్వాములను చేయాలని పిలుపునిస్తున్నాయి. ఐటీ, ఐటీఈఎస్ రంగాల్లో మహిళలు రాత్రి వేళల్లో కూడా పనిచేయడానికి చట్టపరమైన అనుమతులు కల్పిస్తున్నాయి. తెలంగాణలో మహిళలు రాత్రి షిఫ్టుల్లో పనిచేయడానికి ప్రత్యేక సడలింపులు అమల్లో ఉన్నాయి. అంటే రాష్ట్రం మహిళను '24 గంటల ఆర్థిక వ్యవస్థ' లో భాగస్వామిగా చూడాలని కోరుకుంటోంది. కానీ అదే మహిళ అర్ధరాత్రి బస్టాండ్‌లో కనిపిస్తే, కొందరు ఆమెను ఉద్యోగి, పౌరురాలు, మనిషిగా కాకుండా - 'అందుబాటులో ఉన్న వ్యక్తి'గా చూస్తున్నారు. ఇదే హైదరాబాద్ వంటి మహా నగరాల్లో కనిపించే అతిపెద్ద వైరుధ్యం. ఈ ఘటనలో పట్టుబడిన వారిలో చాలామంది విద్యార్థులే అవ్వడం మరింత ఆందోళనకరం. డిగ్రీలు వస్తున్నాయి కానీ సంస్కారం రావడం లేదు. సినిమాల్లో హీరోయిన్ వెంటపడే 'హీరోయిజం', రెండర్థాల సంభాషణలతో కూడిన 'కామెడీ', మహిళను నిరంతరం శారీరక కోణంలో చూపించే 'డిజిటల్ సంస్కృతి' - ఇవన్నీ కలసి యువతలో ఒక ప్రమాదకరమైన భావజాలాన్ని ప్రేరేపిస్తున్నాయి.

మన సమాజం తరచుగా 'మహిళలను కాపాడాలి' అంటుంది. కానీ ఇప్పుడు మరింత అసౌకర్యమైన ప్రశ్న అడగాల్సిన సమయం వచ్చింది - అబ్బాయిలను మనుషులుగా తయారు చేస్తున్నామా? లేక మగాధిక్య అహంకారంతో పెంచుతున్నామా?

ఈ ఘటనలో పోలీసులు స్వచ్ఛందంగా తీసుకున్న చర్య మెచ్చుకోదగ్గది. ముఖ్యంగా ఒక మహిళా ఉన్నతాధికారి స్వయంగా అర్ధరాత్రి వేళ రంగంలోకి దిగి వాస్తవ పరిస్థితిని బయటపెట్టడం అభినందనీయం. పైగా, పోలీసులు సంయమనం పాటించారు - ఆ యువకుల్లో చాలా మందిని శిక్షించలేదు; ప్రథమతప్పిదంగా భావించి, కౌన్సెలింగ్ ఇచ్చి వదిలేశారన్న వార్త హర్షించదగ్గ పరిణామం.

అది కేవలం మరో స్టింగ్ ఆపరేషన్ కాదు; సమాజానికి ఇచ్చిన ఒక కఠినమైన హెచ్చరిక. అసలు పరిష్కారం కుటుంబాల్లో, పాఠశాలల్లో, సినిమాల్లో, డిజిటల్ సంస్కృతిలో, సామాజిక సంభాషణల్లో రావాలి.

ఒక అర్ధరాత్రి స్టింగ్ ఆపరేషన్ మన నగరం యొక్క అసౌకర్యమైన నిజరూపాన్ని చూపించింది. మహానగరంగా ఎదగడం అంటే కేవలం ఎత్తైన భవనాలు కాదు; మహిళ అర్ధరాత్రి కూడా భయం లేకుండా నిలబడగల సామాజిక వాతావరణం నిర్మించడం. లేకపోతే మనం నిర్మిస్తున్నవి స్మార్ట్ సిటీలు కాదు - నాగరిక ముసుగులో ఉన్న ఆటవిక సమాజాలు.

# జీవన సముద్రంలో అనుభవాల కెరటాలు

**జీవితమనే మహాసముద్రంలో మనమందరం నావికులం. ప్రతి అల ఒక అనుభవం, ప్రతి తుఫాను ఒక పరీక్ష, ప్రతి ప్రశాంత తీరం ఒక సాఫల్యం. ఈ యాత్రలో అడుగడుగున కొత్త దృశ్యాలు, కొత్త పాఠాలు, కొత్త బంధాలు మనల్ని ఆహ్వానిస్తాయి. జీవితం అనే ఈ విచిత్రమైన యాత్రను మనం ఎంత గాఢంగా అర్థం చేసుకుంటే, అంత సమృద్ధంగా జీవించగలుగు తాం. జీవితం ఒక యాత్ర ఈ మూడు పదాలలో ఎంత లోతైన తత్వం దాగి ఉందో! పుట్టుక మొదలు మరణం వరకు మనం సాగించే ఈ అనంత ప్రయాణంలో, మనం కేవలం బాటసారులం మాత్రమే కాదు మనమే ఆ బాటను నిర్మించే శిల్పులం కూడా. మన ఆలోచనలు, మన నిర్ణయాలు, మన అనుభవాలు అన్నీ కలిసి ఈ యాత్రను అర్థవంతంగా చేస్తాయి. ఒక పత్రికలో చదివే కథలాంటిది మన జీవితం.**



అది ఎప్పుడు మలుపు తిరుగుతుందో, ఏ పేజీలో ఏ భావోద్వేగం దాగి ఉందో మనకే తెలియదు. కానీ, ఆ కథను అందంగా తీర్చిదిద్దే బాధ్యత మాత్రం మనదే. బాల్యం అనేది ఈ జీవన యాత్రలో అత్యంత పరిశుభ్రమైన, అందమైన తొలి మజిలీ. ఆ రోజులలో ప్రపంచమంతా ఒక విశాలమైన క్రీడాంగణం. ప్రతి మూల ఒక రహస్యం, ప్రతి తోటి స్నేహితుడు ఒక సాహసయాత్రలో భాగస్వామి. అమ్మ పాడే లాలిపాట నుండి నాన్న చెప్పే కథల వరకు ప్రతి క్షణమూ ఒక నూతన అనుభవం. ఆ రోజుల్లో మనకు గమ్యం తెలియదు, మార్గమూ తెలియదు కానీ ప్రయాణంలో ఉన్న ఆనందం మాత్రం హృదయాన్ని నిండుగా చేసేది. మట్టిలో ఆడుకున్న చేతులు, చెట్లు ఎక్కిన కాళ్ళు, అమ్మ ఒళ్ళో నిద్రపోయిన రాత్రులు ఇవన్నీ మనం సాగించిన జీవన యాత్రలో చెరగని ముద్రలు. బాల్యంలో పడిన దెబ్బలు మనకు నేర్చుకోవాలనే తపనను పెంచుతాయి, ఆడిన చిన్న చిన్న ఆటలు జీవితపు అసలైన పాఠాలను నేర్పిస్తాయి. యవ్వనం వచ్చాక ఈ యాత్ర ఒక వేగవంతమైన రూపు దాల్చుతుంది. కలలు ఆకాశాన్ని తాకుతాయి, ఆశయాలు పర్వతాలను జయించాలని ఉవ్విళ్ళూరుతాయి. ప్రేమ, స్నేహం, పోటీ, విజయం, వైఫల్యం అన్నీ ఒకేసారి ఒళ్ళో పడతాయి. ఈ దశలో జీవితం మనకు ఎన్ని రకాల పరీక్షలు పెడుతుందో అన్ని రకాల బహుమతులూ ఇస్తుంది. యవ్వనపు ఉద్వేగాలు, మొదటి ప్రేమ యొక్క తీపి నొప్పి, పరీక్షలలో పోరాటం, ఉద్యోగం కోసం అన్వేషణ ఇవన్నీ ఈ జీవన యాత్రలో తప్పనిసరి మెలికలు. ఈ దశలో మనకు ప్రపంచాన్ని మార్చేయాలనే బలమైన కోరిక ఉంటుంది. ప్రతి విఫలత తదుపరి విజయానికి పునాది వేస్తుంది. వైఫల్యాన్ని చూసి నిరాశ పడే బదులు, ఆ అనుభవంలోంచి నేర్చుకుని ముందుకు సాగడమే నిజమైన యాత్రికుని లక్షణం. యవ్వనం నుండి పరిణతి వైపు సాగే ప్రయాణం మధ్యవయస్సు. ఇది కేవలం వయస్సు మాత్రమే కాదు, ఒక బాధ్యతాయుతమైన ఘట్టం. ఇక్కడ మనం మన కోసం మాత్రమే కాకుండా, మన చుట్టూ ఉన్న వారి కోసం జీవిస్తాం. భార్యాభర్తలుగా, తల్లిదండ్రులుగా, పిల్లలుగా మన పాత్రలు మారుతుంటాయి. ఈ సమయంలో జీవితం ఒక పరీక్షా క్షేత్రంలా మారుతుంది. ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలు, కెరీర్ ఒత్తిడి వంటివి మనల్ని ఉక్కిరిబిక్కిరి చేస్తాయి. కానీ, ఇదే సమయంలో మనం స్థిరత్వాన్ని సంతరించుకుంటాం. జీవితంలో గెలుపోటములను సమానంగా స్వీకరించే మనస్తత్వం ఇక్కడే అలవడుతుంది. బాధ్యతల భారం మనల్ని అణగదొక్కడం కాదు, బాధ్యతగా నడవడం నేర్పుతుంది. ప్రతి యాత్రలో ఒడిదుడుకులు ఉంటాయి. జీవన యాత్రలో వచ్చే కష్టాలు, నష్టాలు, అవమానాలు, బాధలు ఇవి మనల్ని నాశనం చేయడానికి రావు, బలపరచడానికి వస్తాయి. ఒక నావ ప్రశాంతమైన నీటిలో పయనిస్తే అది కేవలం నీటిపై తేలడం మాత్రమే అవుతుంది, కానీ తుఫానులో నావిగేట్ చేస్తేనే దాని నిజమైన బలం తెలుస్తుంది. అలాగే, కష్టాలు వచ్చినప్పుడే మన నిజమైన స్వభావం, మన లోపలి శక్తి బయటపడుతుంది. జీవితంలో కష్టాలు వచ్చినప్పుడు నిరాశపడకండి. ఆ రాత్రి ఎంత చీకటిగా ఉన్నా తెల్లవారు తప్పదు. మహానదులు రాళ్ళను కొట్టుకుంటూనే ముందుకు పోతాయి. మన జీవితమూ అలాంటిదే అడ్డంకులను అధిగమిస్తూ, అనుభవాలను సేకరిస్తూ, మరింత విశాలంగా ప్రవహిస్తుంది.

జీవన యాత్రలో అత్యంత విలువైన సంపద మంచి మనుషులు. తల్లిదండ్రులు, అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ళు, స్నేహితులు, జీవిత భాగస్వాములు వీరంతా ఈ యాత్రలో మనకు తోడు నడిచే ప్రియమైన సాధకులు. ఒంటరిగా నడవడం కష్టం, కానీ ప్రేమతో నిండిన హృదయాలు మన పక్కన ఉంటే ప్రతి పర్వతమూ సులభంగా అనిపిస్తుంది. ఒక మంచి స్నేహితుడి నవ్వు చాలు జీవితపు అలసట తీరిపోవడానికి. ఒక అమ్మ వెచ్చని కౌగిలింత చాలు ప్రపంచపు నొప్పులన్నీ మాయమవడానికి. ఒక ప్రేమించే హృదయం చాలు జీవన యాత్ర అర్థవంతంగా కనిపించడానికి. సంబంధాలను పోషించండి, వాటిని ఆదరించండి ఇవే మీ జీవన యాత్రలో నిత్యానందానికి అసలైన మూలాలు.

జీవన యాత్రలో జ్ఞానం అనేది ఒక దీపస్తంభం వంటిది. చీకటిలో దారి చూపుతుంది, ప్రమాదాల నుండి కాపాడుతుంది, మరింత దూరం పయనించే ధైర్యాన్ని ఇస్తుంది. పుస్తకాల ద్వారా, అనుభవాల ద్వారా, పెద్దవారి మాటల ద్వారా మనం సేకరించే జ్ఞానం ఈ యాత్రను మరింత అర్థవంతంగా, మరింత ప్రయోజనకరంగా చేస్తుంది. ప్రతి పుస్తకం ఒక కొత్త ప్రపంచానికి తలుపు తెరుస్తుంది. ప్రతి అనుభవం ఒక పాఠశాల. ప్రతి వ్యక్తి ఒక గురువు. నేర్చుకోవడం ఆపని వ్యక్తి జీవన యాత్రను నిత్య నవ్యంగా, మరింత ఉత్సాహంగా చేసుకోగలుగుతాడు. జిజ్ఞాస ఉన్నంత కాలం జీవితం నిండుగా ఉంటుంది. జీవితమనే ఈ మహాయాత్రలో గమ్యానికంటే ప్రయాణమే ముఖ్యం. మనం ఎక్కడికి చేరుకుంటామనే దానికంటే, ఏ విధంగా సాగుతున్నామనేది, మన సాహచర్యంతో ఇతరుల జీవితాలు ఎలా మారుతున్నాయనేది ముఖ్యమైన విషయం. ఒక మంచి మాట చెప్పి పోయినా, ఒక సహాయం చేసి వచ్చినా, ఒక నవ్వు పంచి వెళ్ళినా ఈ యాత్ర సార్థకమవుతుంది. ప్రతి ఉదయం ఒక కొత్త అవకాశం. ప్రతి రాత్రి ఒక పాత అనుభవానికి వీడ్కోలు. జీవన యాత్రలో మనం మోసే భారాలు ఒక్కసారి కింద పెట్టి, చుట్టూ ఉన్న అందాలను చూసే వ్యవధి తీసుకోండి. ప్రకృతి, ప్రేమ, పిల్లల నవ్వులు, పండ్ల తోట, వెన్నెల రాత్రి ఇవన్నీ జీవితం మనకు ఇచ్చే నిధులు. వాటిని అనుభవించండి, హృదయంలో దాచుకోండి. జీవితం ఒక యాత్ర ఈ యాత్రలో ఒడిదుడుకులు ఉంటాయి, అందమైన దృశ్యాలు ఉంటాయి, ప్రేమాస్పదమైన తోడులు ఉంటాయి. ఈ అన్నింటినీ మనసారా స్వీకరించండి. గతంలో చిక్కుకోకండి, భవిష్యత్తు గురించి భయపడకండి ఈ క్షణంలో, ఈ యాత్రలో పూర్తిగా జీవించండి. అదే నిజమైన జీవితం. ఆనందంగా సాగించండి మీ జీవన ప్రయాణాన్ని!




డా .సూర్యదేవర రామకృష్ణ ,
9490754169

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
శుక్రవారం 8-5-2026


# ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలి

- ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలి...
- భూ భారతి దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను వేగవంతం చేయాలి...
- సాదా బైనమా దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించాలి...
- యాదాద్రి జిల్లా రెవిన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి



**యాదాద్రి జిల్లా, మే 7, క్రైమ్ మిర్రర్:** భూ భారతి రెవిన్యూ సదస్సు లో వచ్చిన దరఖాస్తులు, సాదా బైనామా, ధాన్యం కొనుగోలు, ప్రభుత్వ భూములు పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి మండల తహసీల్దార్ లను ఆదేశించారు.గురువారం తన ఛాంబర్ లో మండల తహసీల్దార్ లతో భూ భారతి, రెవిన్యూ సదస్సు లో వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి చేపడుతున్న చర్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, సంబంధించిన అన్ని దరఖాస్తులను క్లియర్ చేయాలని అన్నారు. భూ భారతి దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి, కొనుగోలు కేంద్రానికి వచ్చిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు కొనుగోలు చేయాలన్నారు. ధాన్యం బస్తాలను లారీల ద్వారా సకాలంలో మిల్లులకు తరలించాలన్నారు. రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలనీ తెలిపారు.సాదా బైనమా దరఖాస్తులను పరిశీలించి, పరిష్కరించాలన్నారు. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జయమ్మ ,రెవిన్యూ డివిజనల్ అధికారులు కృష్ణా రెడ్డి, చౌటుప్పల్ ఆర్డీఓ వి.శేఖర్ రెడ్డి, మండల తహసీల్దార్ లు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# ప్రధాని నరేంద్రమోడీ సభను విజయవంతం చేద్దాం

### అత్తాపూర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు సులిగే వెంకటేష్



**గండిపేట(క్రైం మిర్రర్):** భారతదేశ ప్రధాని నరేంద్రమోడీ భారీ బహిరంగ సభను విజయవంతం చేసేందుకు ప్రతి నాయకుడు, కార్యకర్త కృషి చేయాలని అత్తాపూర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు సులిగే వెంకటేష్ కోరారు. హైదర్‌గూడలో గురువారం బీజేపీ నాయకుల సమావేశాన్ని యువ మోర్చా డివిజన్ అధ్యక్షుడు సులిగే మణికంఠ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మే 10వ తేదీన ప్రధాని నరేంద్రమోడీ బహిరంగ సభ ఛలో పరేడ్ గ్రౌండ్‌కు అత్తాపూర్, హైదర్‌గూడ డివిజన్‌ల నుంచి భారీ ఎత్తున తరలివెళ్లాలన్నారు. 100కు పైగా బైక్‌లతో ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పస్పుల సందీప్‌ముదిరాజ్, జిల్లా యువ మోర్చా ఉపాధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డి, అమర్‌రెడ్డి, భూపాల్, అఖిల్, లఖన్, శివరాజ్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

# బండిరమేష్‌కు ఘన సన్మానం..

### మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించిన కాంగ్రెస్ నేతలు







**కూకట్‌పల్లి, మే 07 (క్రైమ్ మిర్రర్) :** తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్‌గా ఎంపికైన టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్‌కు కాంగ్రెస్ నాయకులు ఘన సన్మానం నిర్వహించారు. కూకట్‌పల్లిలోని ఆంజనేయనగర్ కాలనీలో ఉన్న కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు శేరి సతీష్ రెడ్డి, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, సాదు ప్రతాప్ రెడ్డి, కూకట్‌పల్లి పట్టణ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు కర్క పెంటయ్య, కూకట్‌పల్లి నియోజకవర్గ ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు కర్క నాగరాజు తో కలిసి బండి రమేష్‌ను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాసేవ పట్ల నిబద్ధత, పార్టీ పట్ల విశ్వాసంతో ఎంతో తక్కువ సమయంలోనే బండి రమేష్ ప్రజల్లో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారని కొనియాడారు. సామాన్య ప్రజల సమస్యల పరిష్కారానికి ఎప్పుడూ ముందుండే నాయకుడిగా ఆయన పేరు తెచ్చుకున్నారని పేర్కొన్నారు. ప్రజల మన్ననలు పొందుతూ రాజకీయంగా మరింత ఉన్నత స్థాయికి ఎదిగి భవిష్యత్తులో మరిన్ని కీలక పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి బండి రమేష్ చేస్తున్న కృషి అభినందనీయమని, కూకట్‌పల్లి నియోజకవర్గంలో పార్టీకి కొత్త ఉత్సాహం తీసుకొస్తున్న నాయకుడిగా ఎదుగుతున్నారని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గొట్టిముక్కల జస్వంత్ రావు, కొండల్ రెడ్డి, అరవింద్ రెడ్డి, మేకల మైఖేల్, అశోక్, సంజీవరావు, శ్రీధర్ చారి, గిరి నాయుడు, తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు.

# ద్విచక్ర వాహనం వెనక చక్రంలో చీర కొంగు చుట్టుకుని మహిళ మృతి



**ఆత్మకూరు(ఎం),మే07/క్రైమ్ మిర్రర్:** యాదాద్రి భువనగిరి జిల్లా మోటాకొండూర్ మండలం ముత్తిరెడ్డిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలో గురువారం రోజున రాయగిరి నుండి మోత్కూర్ వెళ్ళు రహదారిపై ముత్తిరెడ్డిగూడెం గ్రామ శివారు లోని ఏకు చంద్రారెడ్డి ఇంటి వద్ద ఉదయం సుమారుగా 11-00 గంటల సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనం వెనక చక్రంలో చీర కొంగు చిక్కుకుని ఒక మహిళా చనిపోవడం జరిగింది.వివరాల్లోకి వెళితే వలిగొండ మండలం "వెలువర్తి గ్రామానికి చెందిన పులగళ్ల ఉప్పలమ్మ భర్త చంద్రయ్య, వయసు 50 సంవత్సరాలు,కులం ఎస్సీ- మాదిగ,వృత్తి కూలీ తన కూతురు అయినటువంటి మందుల లత భర్త కృష్ణంరాజు ఆత్మకూరు(ఎం)మండలం సింగారం గ్రామంకు బుధవారం తేదీ: 06.05.2026 రోజున తనను చూడడానికి అక్కడికి వెళ్లి, తిరిగి గురువారం రోజు ఉదయం సుమారుగా 10-00 గంటలకు తన తమ్ముడైనటువంటి వుక్కుర్తి యాదయ్య తండ్రి పాపయ్య వెలువర్తి గ్రామానికి తన బైకు మీద తీసుకోని వెళ్తుండగా మార్గమధ్యమంలో ముత్తిరెడ్డి గూడెం శివారులోని ఏకు చంద్రారెడ్డి ఇంటి వద్దకు రాగానే వెనకాల కూర్చున్న ఉప్పలమ్మ యొక్క చీర కొంగు ద్విచక్ర వెనుక చక్రంలో చుట్టుకుని ఉప్పలమ్మ కింద రోడ్డుపై పడిపోగా ఆమె తల వెనుక భాగంలో రక్త గాయం అయినది. వెంటనే ముత్తిరెడ్డిగూడెంలోని ఆర్ఎంపీ డాక్టర్ దగ్గరికి వెళ్లి చూపించగా అప్పటికే మరణించినదని చెప్పినాడు. ఉప్పలమ్మ కూతురు మందుల లత ఫిర్యాదు మేరకు మోటకొండూర్ పిఎస్ నందు కేసు నమోదు చేసి శవాన్ని భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించి శవ పంచనామా మరియు శవ పరీక్ష అనంతరం దహన సంస్కరణల నిమిత్తము శవాన్ని వారి బంధువులకు అప్పయించడం జరిగిందని తెలిపారు.

# శంకర్‌పల్లిలో ఒయాసిస్ ఐవీఎఫ్ మొబైల్ ఫెర్టిలిటీ క్లినిక్ ప్రారంభం



**క్రైమ్ మిర్రర్ శంకర్ పల్లి :** శంకర్‌పల్లిలో ఒయాసిస్ ఐవీఎఫ్ మొబైల్ ఫెర్టిలిటీ క్లినిక్‌ను ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని శంకర్‌పల్లి మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి సాత విజయలక్ష్మి, శంకర్‌పల్లి మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ జూలకంటి శ్వేత పాండురంగ రెడ్డి, ఏఎంసీ చైర్‌పర్సన్ గోవిందమ్మ గోపాల్ రెడ్డి కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆధునిక వైద్య సేవలను గ్రామీణ ప్రాంతాలకు చేరవేయడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఒయాసిస్ ఐవీఎఫ్ మొబైల్ ఫెర్టిలిటీ క్లినిక్ ద్వారా సంతాన సమస్యలపై అవగాహన పెరగడంతో పాటు, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, మహిళలు, మరియు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# ఆల్విన్ కాలనీ ఎన్‌టీఆర్ నగర్‌లో ఆధ్యాత్మిక వేడుకలకు సన్నాహాలు

### పంచముఖ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠకు జిల్లా గణేష్ కు ఆహ్వానం



**కూకట్ పల్లి, మే 07 (క్రైమ్ మిర్రర్) :** శేరిలింగంపల్లి నియోజకవర్గం, ఆల్విన్ కాలనీ డివిజన్ ఎన్‌టీఆర్ నగర్‌లో గల శ్రీ అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర దేవాలయంలో నూతనంగా ప్రతిష్ఠించనున్న పంచముఖ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాలకు ఆలయ కమిటీ సభ్యులు కాంగ్రెస్ సీనియర్ నాయకులు జిల్లా గణేష్ నేతను మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ పంచముఖ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు ఈ నెల 11-05-2026న ఘనంగా ప్రారంభమై, 13-05-2026న ప్రతిష్ఠ కార్యక్రమంతో ముగియనున్నాయని తెలిపారు. మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు, హోమాలు, భజనలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు, కాలనీ వాసులు, యువత, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు. పంచముఖ ఆంజనేయ స్వామి అనుగ్రహంతో ప్రజలం దరికీ ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్ర మంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

## వివేకానంద నగర్ డివిజన్ పరిధిలో

# పరిశుభ్రతకు పెద్దపీట

### రామకృష్ణ వీధిలో భారీ స్వచ్ఛత కార్యక్రమం -- మట్టి దిబ్బలు, చెత్త తొలగింపు


### రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు జనంపల్లి పురేందర్ రెడ్డి



**కూకట్ పల్లి, మే 07 (క్రైమ్ మిర్రర్) :** శేరిలింగంపల్లి నియోజకవర్గం, వివేకనంద నగర్ డివిజన్ పరిధిలోని రామకృష్ణ వీధిలో కాలనీ అభివృద్ధి, పరిశుభ్రత కోసం కాలనీ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక శుభ్రత కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు జనంపల్లి పురేందర్ రెడ్డి నేతృత్వంలో మున్సిపల్ ట్రాక్టర్ సహాయంతో రోడ్లపై పేరుకుపోయిన మట్టి కుప్పలు, రాళ్లు, చెత్త చెదారం, పాత పురాతన వస్తువులు పూర్తిగా తొలగించి కాలనీ అంతటా పరిశుభ్ర వాతావరణాన్ని కల్పించారు. కాలనీలోని ప్రధాన వీధులు, అంతర్గత రోడ్లపై మిగిలిపోయిన మట్టి దిబ్బలను పూర్తిగా తొలగించి రోడ్లను శుభ్రంగా మార్చడం పట్ల స్థానిక కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. పరిశుభ్రమైన కాలనీ నిర్మాణమే తమ లక్ష్యమని కమిటీ సభ్యులు తెలిపారు.ఈ సందర్భంగా అధ్యక్షులు జనంపల్లి పురేందర్ రెడ్డి మాట్లాడుతూ కాలనీలో డ్రైనేజీ సమస్యలు, మంచినీటి ఇబ్బందులు, వీధి దీపాల సమస్యలు లేదా ఇతర పౌర సమస్యలు ఏవైనా ఉంటే వెంటనే కమిటీ సభ్యులకు తెలియజేయాలని కోరారు. సమస్యల పరిష్కారానికి కమిటీ శక్తివంచన లేకుండా కృషి చేస్తుందని హామీ ఇచ్చారు. అలాగే కాలనీవాసులకు ముఖ్యంగా ప్రతి ఒక్కరూ తమ ఇంటి ముందు రోడ్లను పరిశుభ్రంగా ఉంచాలని, చెత్త చెదారం రోడ్లపై వేయకుండా బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. ఎవరైనా నిర్లక్ష్యంగా రోడ్లపై చెత్త వేస్తే మున్సిపల్ అధికారులు, కాలనీ కమిటీ సభ్యులు కఠిన చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు. కాలనీ అభివృద్ధి, పరిశుభ్రత, ప్రజల ఆరోగ్యం కోసం అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు.


## క్రైమ్ మిర్రర్ తెలుగు వెబ్‌సైట్‌కు కంటెంట్ రైటర్లు కావలెను

### సీనియర్లకు మాత్రమే ప్రాధాన్యం



తెలుగులో న్యూస్, ఇన్వెస్టిగేటివ్ రిపోర్టింగ్, సోషల్ అప్‌డేట్స్ మరియు ఫీచర్ రైటింగ్‌లో ఆసక్తి ఉన్న వారికి మంచి అవకాశం.

క్రైమ్ మిర్రర్ తెలుగు డిజిటల్ మీడియా టీమ్ విస్తరణలో భాగంగా అనుభవజ్ఞులైన కంటెంట్ రైటర్లు (సీనియర్ జర్నలిస్టులు, సబ్ ఎడిటర్లు) అవసరం.

తెలుగు భాషపై పట్టు, వార్తా రచనా నైపుణ్యం ఉండాలి. రాజకీయ, క్రైమ్, సోషల్ ఇష్యూస్, ఫీల్డ్ రిపోర్టింగ్‌పై అనుభవం ఉంటే ప్రాధాన్యం.

న్యూస్ వెబ్‌సైట్, ప్రింట్, డిజిటల్ జర్నలిజంలో కనీసం 1 సంవత్సరాల అనుభవం తప్పనిసరి.

స్వతంత్రంగా వార్తలు సిద్ధం చేయగలగాలి, ఫ్యాక్ట్ చెక్ అవగాహన ఉండాలి.

సీనియర్ కంటెంట్ రైటర్స్, సబ్ ఎడిటర్ (డెస్క్ న్యూస్ ఎడిటింగ్), ఫీల్డ్ రిపోర్టర్, ప్రాంతీయ కవరేజ్ కోసం.

సీనియర్ జర్నలిస్టులు, డెస్క్ అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వబడుతుంది.

ఫ్రీలాన్స్ లేదా పార్ట్‌టైమ్ ఆధారంగా కూడా అవకాశాలు అందుబాటులో ఉన్నాయి.

**9393929595**



## అంగన్వాడి కేంద్రంలలో పోషకాహార పంపిణీ...!

**జగిత్యాల జిల్లా బ్యూరో(క్రైమ్ మిర్రర్):** తులసీనగర్, ఇస్లాంపుర అంగన్వాడీ కేంద్రంలలో 29 వార్డు కౌన్సిలర్ తోపరపు లావణ్య రజనీకాంత్ అధ్యక్షతన సీడీపీవో జయప్రద ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు వేసవి సెలవుల సందర్భంగా గర్భిణీ స్త్రీలకు బాలింతలకు ఆరు నెలల నుంచి మూడు సంవత్సరాల పిల్లలకు మూడు నుండి ఆరు సంవత్సరాల పిల్లలకు బరువులు ఎత్తులు తీసి తల్లులకు అవగాహన కలిగించి వారికి 25 రోజులకు ఇంటికి సరుకులు బియ్యము పప్పు నూనె గుడ్లు, పాలు బాలామృతము బాలామృతం ప్లస్సు మురుకులు ఇంటికి ఇవ్వడము జరిగినది ఈ కార్యక్రమంలో తల్లులకు ఎండలు బాగా ఉన్నందున పిల్లలు తల్లులు తీసుకొనవలసిన జాగ్రత్తలు ఎక్కువసార్లు పానీయాలు వాటరు కొబ్బరి నీళ్లు తాగించవలెనని గర్భిణీ లు రోజు ఆకుకూరలు కూరగాయలు,పండ్లు,పాలు విశ్రాంతి తీసుకోవాలని తల్లులకు అవగాహన కలిగించినది ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ తోపరపు లావణ్య రజనీకాంత్ సీడీపీవో జయప్రద, ఏసీడీపీవో రాజశ్రీ సూపర్వైజర్ మమత, అంగన్వాడి టీచర్స్ , అరుణ ఫాతిమా, రీజీ వాన బేగంగర్భవతులు బాలింతలు తల్లులు పిల్లలు పాల్గొన్నారు.

## బీరంగూడలో నూతన ట్రాన్స్ఫార్మర్ ప్రారంభించిన విద్యుత్ అధికారులు



**పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి మే 07:** పటాన్‌చెరు నియోజకవర్గంలోని జీహెచ్ఎంసీ పరిధి బీరంగూడ డివిజన్ సృజన లక్ష్మీ నగర్ కాలనీలో ఏర్పాటు చేసిన 100 కెవీ నూతన ట్రాన్స్ఫార్మర్‌ను అమీన్‌పూర్ విద్యుత్ అధికారులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అమీన్‌పూర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు శశిధర్ రెడ్డి పాల్గొని ట్రాన్స్ఫార్మర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా శశిధర్ రెడ్డి మాట్లాడుతూ... కాలనీలో పెరుగుతున్న విద్యుత్ లోడ్ సమస్యలను దృష్టిలో ఉంచుకుని ప్రజలకు అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు ఈ ట్రాన్స్ఫార్మర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. స్థానిక ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో విద్యుత్ శాఖ అధికారులు చేసిన కృషిని అభినందించారు. అలాగే ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు కోసం సహకరించిన డీఈ, ఏఈలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కాలనీ వాసులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## టిపిసిసి ఉపాధ్యక్షుడు బండి రమేష్ కు అభినందనల వెల్లువ



**కూకట్ పల్లి, మే 07 (క్రైమ్ మిర్రర్) :** తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ గా నియమితులైన టిపిసిసి ఉపాధ్యక్షుడు, జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జి, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్ కు అభినందనలు వెల్లువెత్తాయి. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కమ్మ సేవా సంఘాల నాయకులు హైదరాబాద్ నగరవ్యాప్తంగా ఉన్న కమ్మ నాయకులు రమేష్ ను ఆయన నివాసంలో, కార్యాలయంలో కలిసి బొకే ఇచ్చి శాలువాలు కప్పి సన్మానించి అభినందనలు తెలియజేశారు. వీరితో పాటు వివిధ కులసంఘాల నాయకులు సైతం రమేష్ నివాసానికి పెద్ద ఎత్తునచేరుకుని అభినందించారు. చైర్మన్ గా కార్పొరేషన్ అభివృద్ధికి కృషి చేయడంతో పాటు ఇతర సంఘాల కార్పొరేషన్ ల అభివృద్ధికి సైతం కృషి చేయాలని వారు ఆకాంక్షించారు ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ పార్టీ పట్ల నిబద్ధత నిజాయితీ కష్టించి పని చేసే తత్వం అందరినీ కలుపుకుపోయే విధానంతో రమేష్ సేవలను గుర్తించి పార్టీ అధిష్టానం ఆయనకు వివిధ హోదాల్లో పదవులను కేటాయిస్తోందన్నారు. పార్టీ అభివృద్ధికి, నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్న రమేష్ పార్టీలో తను అనుకున్న స్థానాన్ని చేరుకోగలరని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ పార్టీ తనకు ఇచ్చిన పదవులను తాను బాధ్యతగా గౌరవంగా భావిస్తానని అందరినీ కలుపుకుపోతూ తన శక్తిమేరా ఆ పదవులకు వన్నెతెచ్చేలా కృషి చేస్తానని పేర్కొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం

- చౌటుప్పల్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన మాజీ మంత్రి టీ.హరీష్ రావు
- చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ యార్డులోని ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి....
- బీ.ఆర్.ఎస్ ప్రభుత్వం రైతులను అన్ని విధాలుగా ఆదుకుంది...
- కాంగ్రెస్ పాలనలో రైతులకు అడుగడుగునా ఇబ్బందులు...
- బీఆర్ఎస్ మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు





**చౌటుప్పల్, మే 07, క్రైమ్ మిర్రర్ :** రైతుల వద్ద నుండి వరి ధాన్యం కొనుగోలు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బిఆర్ఎస్ పార్టీ మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా, చౌటుప్పల్ పట్టణ కేంద్రం వ్యవసాయ మార్కెట్లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే టి.హరీష్ రావు,మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి సందర్శించారు. నేరుగా రైతుల వద్దకు వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.నెల రోజులుగా వరి ధాన్యాన్ని కొనుగోలు చేయడం లేదని, తాము కష్టపడి పండించిన పంటను తరుగు పేరుతో రైతులను దోచుకుంటున్నారని పలువురు రైతులు ఆయన ఎదుట ఆవేదనను వ్యక్తం చేశారు.ధాన్యం రాశులను పరిశీలించిన హరీష్ రావు రైతులకు ధైర్యం చెప్పారు. అనంతరం మీడియా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ...రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం కొనుగోలు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తుందన్నారు.వడ్ల కుప్పల వద్దనే రైతుల గుండెలు ఆగిపోతున్న రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డికి కనీస కనికరం లేదన్నారు. కెసిఆర్ ప్రభుత్వంలో వడ్ల కొనుగోలులో ఏనాడు ఇంతటి దారుణ పరిస్థితి లేవన్నారు. కాంగ్రెస్ పాలనలో రైతులకు యూరియా, రైతుబంధు, సాగునీరు,విద్యుత్,చివరికి పండిన పంట అమ్ముకునే దాకా రైతులకు అడుగడుగునా ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.ధాన్యం కొనుగోలు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు.జిల్లా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ధాన్యం కొనుగోలు సజావుగా జరుగుతున్నాయని చెప్పడం వాస్తవాలకు విరుద్ధమని మాజీ మంత్రి టి.హరీశ్ రావు ఆరోపించారు. తాను ఏసీ రూములో కూర్చుని మాట్లాడటం లేదని తమ జిల్లాలోని చౌటుప్పల్ మున్సిపాలిటీ వ్యవసాయ మార్కెట్లో రైతుల మధ్య నిలబడి మాట్లాడుతున్నానని తెలిపారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని మార్కెట్ కు తీసుకువచ్చి రోజులు గడుస్తున్న మ్యాచర్ చూసి పాస్ అన్నాక కూడా రైతుల ధాన్యపు రాశులను కాంట పెట్టే దిక్కు లేదన్నారు. 44 డిగ్రీల ఎండలో కూడా ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులు రోజులు తరబడి పడిగాపులు కాస్తూ పిట్టల రాలిపోతున్నారని ఇది పూర్తిగా ప్రభుత్వ చేతగాని తనమే అని అన్నారు.

**ధాన్యం కొనుగోలు ప్రక్రియలో తీవ్ర జాప్యం...**

రైతులు తమ పండించిన పంటను కొనుగోలు కేంద్రానికి తీసుకు వచ్చిన తర్వాత మాయిశ్చర్ చూడటానికి 10 రోజులు, సంచులు ఇవ్వడానికి వారం రోజులు, కాంటా పెట్టడానికి వారం రోజులు, మిల్లులకు తరలించడానికి మరో వారం రోజులు పడుతుందని అన్నారు. తీరా మిల్లులకు ధాన్యం వెళ్ళాక తాలు ఉందని చెప్పి లారీకి నాలుగైదు బస్తాలు కటింగ్ పెడుతున్నారని అన్నారు. అటు మార్కెట్లో తరుగు, ఇటు మిల్లుల్లో కోత పెడుతున్నారని అసలు ప్రభుత్వానికి వడ్లు కొనడం చేతనవుతుందా అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి పాలన" ఢిల్లీకి నజరానా... రైతులకు ఏమో జరిమానా" అన్నట్లు తయారయిందన్నారు.

**ధాన్యం కొనుగోలును వెంటనే చేపట్టాలి....**

అకాల వర్షాల నేపథ్యంలో రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని , చౌటుప్పల్ మార్కెట్ యార్డులో వర్షం పడితే వడ్ల కుప్పలు నీట మునిగే ప్రమాదం ఉందని, రైతులు అనుక్షణం భయపడుతున్నారని అన్నారు, ప్రభుత్వం తక్షణమే మార్కెట్లకు లారీలు,గన్ని బ్యాగులు పంపించటంతో పాటు మిల్లర్లకు ఖచ్చితమైన ఆదేశాలు జారీ చేసి యుద్ధ ప్రతిపాదికన కొనుగోలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తాను చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కు వస్తున్నానని తెలిసి నాలుగైదు లారీలు పంపించారని తాము వస్తే తప్ప లారీలు పంపరా అని ప్రశ్నించారు.రాష్ట్ర,దేశ చరిత్రలో యూరియా అమ్మకాలపై నిషేధం విధించిన ఘనత సీఎం రేవంత్ రెడ్డి సర్కార్ కే దక్కిందన్నారు. మొక్కజొన్నలు,సన్ ఫ్లవర్ కొని నెలలు దాటుతున్న రైతులకు ఒక్క రూపాయి వేయలేదన్నారు. రైతుబంధు, యూరియా,రుణమాఫీ, కొనుగోలు అన్ని ఎగ్గొట్టినందుకు రైతు భరోసా వారోత్సవాలను నిర్వహిస్తున్నారా అని అయన ప్రశ్నించారు. మంచిర్యాల,నల్లగొండ జిల్లాలో రైతులు చనిపోయిన విషయాన్ని గుర్తు చేశారు. “తరుగు తీస్తే తోలు తీస్తా “ అని పలికిన సీఎం ఇప్పుడు రైతుల బస్తాలకు రెండు నుంచి మూడు కిలోల కోత పెడుతుంటే ఎందుకు మౌనం వహిస్తున్నారు అంటూ ప్రశ్నించారు.

**బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులను కంటికి రెప్పలా కాపాడుకుంది...**

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ రైతులకు కరెంటు,సాగునీరు,రైతుబంధు ఇచ్చి వ్యవసాయాన్ని పండుగ చేశారని, రైతులను కంటికి రెప్పలా కాపాడుకున్నారని తెలిపారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల వద్ద నుండి ధాన్యం కొనకుండా జాప్యం చేసి,రైతులు దళారులకు అగ్గువకు అమ్ముకునేలా కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే రైతుల వద్ద నుండి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి ఆదుకోవాలని అయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి , సింగిల్ విండో చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి,బీఆర్ఎస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# రాష్ట్ర వడ్డెర సహకార సంస్థ చైర్ పర్సన్ గా గుంజ రేణుక నియామకం



**కూకట్ పల్లి, మే 07 (క్రైమ్ మిర్రర్) :** తెలంగాణ రాష్ట్ర వడ్డెర కో ఆపరేటివ్ కార్పొరేషన్ చైర్ పర్సన్ గా సీనియర్ కాంగ్రెస్ నాయకురాలు, పిసిసి సభ్యురాలు, అఖిల భారత వడ్డెర సంక్షేమ సంఘం, జాతీయ మహిళా ప్రధాన కార్యదర్శి గుంజ రేణుక నారాయణ నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే. రామకృష్ణారావు అయనను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ గా నియమితులైన గుంజ రేణుక మాట్లాడుతూ తన సేవలను గుర్తించి ఎంతో నమ్మకంతో అప్పజెప్పిన ఈ పదవీ బాధ్యతలు మరింత బాధ్యతను పెంచాయని, పార్టీ పటిష్టతకు, సంఘ అభ్యున్నతికి తన వంతు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కి, మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి కి, జానారెడ్డి కి , పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కి, సంఘం వ్యవస్థాపక గౌరవ జాతీయ అధ్యక్షులు ఎం. నారాయణస్వామి కి, జాతీయ ప్రధాన కార్యదర్శి గుంజ శ్రీనివాస్ కి, రాష్ట్ర గౌరవ అధ్యక్షులు జివి నారాయణ, రాష్ట్ర అధ్యక్షులు మంజల రమేష్, రాష్ట్ర కార్యనిర్వహక అధ్యక్షులు వంటిపులి శ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుంజ నరసింహ, రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు కుంచపు రమా, రాష్ట్ర కార్మిక విభాగం అధ్యక్షులు సాతాల గోపాల్, రాష్ట్ర కార్మిక విభాగం ప్రధాన కార్యదర్శి ఇడిగోటి నాగేష్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు రాపెన్ గిరిబాబు, ఉమ్మడి నల్గొండ జిల్లా అధ్యక్షులు వేముల సుధాకర్, ఉమ్మడి మేడ్చల్ జిల్లా అధ్యక్షులు ఇరగదిండ్ల వెంకటేష్, ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షులు రాయల రమణయ్య, యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు గుర్రం కుమారస్వామి, కుల బంధువులందరి తరపున రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపడంతో పాటు కుల బంధువులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

## చింతల్‌మెట్‌లో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికుల సమావేశం



**గండిపేట(క్రైం మిర్రర్):** భవన నిర్మాణ కార్మిక సంఘం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో చింతల్‌మెట్ లేబర్ అడ్డాలో భవన నిర్మాణ కార్మికులకు లేబర్ కోర్డులపై అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఏఐటియూసీ రాజేంద్రనగర్ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎండి సలీం సయ్యద్ ఖాజా అధ్యక్షతన నిర్వహించారు. అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ బి.వల్య, జూనియర్ అసిస్టెంట్ శ్యాంకుమార్‌లు హజరైయ్యారు. వారు మాట్లాడుతూ ప్రతి భవన నిర్మాణ కాఇర్మకుడు 110 చెల్లించి భవన నిర్మాణ సంక్షేమ మండలిలో నమోదు చేసుకోవాలన్నారు. నమోదు చేసుకున్న కార్మికులకు ఐదు సంవత్సరాల వరకు ఈ కార్డు కాలపరిమితి ఉంటుందని ఈ కార్డు ఉన్న ప్రతి కార్మికుడికి ప్రమాద భీమా కింద పది లక్షల అందించడం జరుగుతుందన్నారు. అలాగే సహజ మరణం కింద రెండు లక్షల రూపాయలు ప్రభుత్వం అందజేపస్తుందని వసతి సహయ, వివాహ కానుక కింద 30000 ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. కార్డు ఉన్న ప్రతి కార్మికుడు ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి మీ సేవా ద్వారా రెన్యువల్ చేసుకోవాలన్నారు. లబ్ధిదారులకు నేరుగా వారి బ్యాంక్ అకౌంట్‌లోకి డబ్బులు రావడం జరుగుతుందన్నారు. మధ్యవర్తులు ఎవరిని ఆశ్రించవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ ఏఐటియూసీ అధ్యక్ష, కార్యదర్శులు ఎండి సలీం, సయ్యద్ ఖాజా, నాయకులు ఆలీభాయ్, సిపిఐ చింతల్‌మెట్ శాఖ కార్యదర్శి ఎండి.సాబీర్, భవన నిర్మాణ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

క్రైమ్ మిర్రర్

విలేకరులు కావలెను

క్రైమ్ మిర్రర్ తెలుగు దినపత్రికలో
పనిచేయుటకు రంగారెడ్డి జిల్లా,
మండలవారీగా, షాద్నగర్ ,
కేశంపేట, కడ్తాల్, కందుకూరు,
కొత్తూరు, తలకొండపల్లి
అనుభవం కలిగిన రిపోర్టర్లు కావలెను.
ఆతక్తిగలవారు ఈక్రింది
నెంబరుకు సంప్రదించగలరు.

Email ID: crimemirrorts@gmail.com

9393 44 6188

# రజక సంఘం కో-ఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్‌గా అజయ్ కుమార్ నియామకం

## కూకట్‌పల్లి యువ నాయకుడికి కీలక బాధ్యతలు



**కూకట్ పల్లి, మే 07 (క్రైమ్ మిర్రర్) :** కూకట్‌పల్లి ప్రాంతానికి చెందిన ఎన్ ఎస్ యూ ఐ రాష్ట్ర నాయకులు డాక్టర్ దాసరి రాజు ఆధ్వర్యంలో పనిచేస్తున్న యువ నాయకుడు అజయ్ కుమార్‌కు రాష్ట్ర స్థాయిలో కీలక పదవి దక్కింది. రాష్ట్ర రజక సంఘం కో-ఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్‌గా అజయ్ కుమార్‌ను నియమిస్తూ గురువారం నియామక పత్రాన్ని రాష్ట్ర పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, రజక సంఘం ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని అజయ్ కుమార్‌కు శుభాకాంక్షలు తెలిపారు. పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. నియామక పత్రం స్వీకరించిన అనంతరం అజయ్ కుమార్ మాట్లాడుతూ“నాపై నమ్మకం ఉంచి రాష్ట్ర రజక సంఘం కో-ఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను” అని అన్నారు. రజక సంఘం కుటుంబాల ఆర్థికాభివృద్ధి, సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు. యువతకు ఉపాధి అవకాశాలు, స్వయం ఉపాధి పథకాలు, సంఘ సభ్యుల సంక్షేమం కోసం ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. అజయ్ కుమార్ నియామకంతో కూకట్‌పల్లి ప్రాంత కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్న యువ నాయకుడికి ఈ పదవి రావడం పట్ల స్థానిక నాయకులు హర్షం వ్యక్తం చేశారు.



## టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌ను కలిసిన పద్మశాలి కో-ఆపరేటివ్ చైర్మన్ గూడూరు శ్రీనివాస్

**గండిపేట(క్రైం మిర్రర్):** హైదరాబాద్ గాంధీభవన్‌లో టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్‌ను నూతనంగా ఎన్నికైన పద్మశాలి కో--ఆపరేటివ్ లిమిటెడ్ చైర్మన్ గూడూరు శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మసున రవికుమార్, కోణంపెట్ నర్సింగ్, గుండు రవితేజ, బొల్ల వెంకటేష్, ఎంగలి ప్రసాద్, తాటి ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి పి.సబితాఇంద్రారెడ్డి, కార్తీక్‌రెడ్డిలను కలిసిన రాజేంద్రనగర్ బీఆర్ఎస్ నాయకులు





**గండిపేట(క్రైం మిర్రర్):** బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి అందరు సమిష్టిగా కష్టపడాలని తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితాఇంద్రారెడ్డి, రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పట్లోళ్ల కార్తీక్‌రెడ్డిలు అన్నారు. గురువారం రాజేంద్రనగర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పోరెడ్డి ధర్మారెడ్డి ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి పార్టీలో అభివృద్ధి కోసం చేపట్టాల్సిన అవసరాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా నాయకులు సబితాఇంద్రారెడ్డి జన్మదినం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎర్రోళ్ల యాదయ్య, రావుల జంగయ్య, సరికొండ దుర్గేష్, బండ్ల నరేంద్ర, ప్రొఫెసర్ రవీందర్, గిరిబాబు, కట్టేలమండి గౌతమ్, ఉదయ్‌రెడ్డి, రాముయాదవ్, విజయ్, అనూప్‌రెడ్డి, నీరజ్, ఆకాశ్, అఖిల్, జి.రాజు, నాని తదితరులు పాల్గొన్నారు.

# నార్సింగిలో నీటి కష్టాలు



### ఈ నెల 16న బీఆర్ఎస్ భారీ ధర్నా

### వాక్ ఫర్ వాటర్‌కు పిలుపు

### నార్సింగి సర్కిల్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి

**గండిపేట(క్రైం మిర్రర్) :** నార్సింగి సర్కిల్ పరిధిలో నెలకొన్న తీవ్ర నీటి ఎద్దడిని నిరసిస్తూ ఈ నెల 16వ తేదీన బీఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీ ధర్నా, వాక్ ఫర్ వాటర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నార్సింగి సర్కిల్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ధర్నాకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ మా నీరు మాకే ఇవ్వండి అనే నినాదంతో ఈ ఆందోళన చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. నార్సింగి సర్కిల్ పరిధిలోని వివిధ గ్రామాల్లో తాగునీటి సమస్య జఠిలమవుతుందని, వాటర్ వర్క్? అధికారులు నీటి సరఫరాలో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నాన్నా. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి అధికారులను కలిసి సమస్యను వివరించామన్నారు. సరైన నీటి సరఫరా లేక ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకోని ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ఈ నిరసన కార్యక్రమానికి సిద్ధం చేస్తున్నామన్నారు. నార్సింగి సర్కిల్ పరిధిలోని ప్రజలు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తునద పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ నియోజకవర్గ మైనార్టీ అధ్యక్షుడు షేక్ ముక్తార్, సీనియర్ నాయకులు నరసింహ, బొమ్మాలి మల్లేష్, గణేష్‌రెడ్డి, గణేష్, మహిపాల్, శ్రీకాంత్‌రెడ్డి, మహిళా విభాగం అధ్యక్షురాలు తనీషా, ఇందిరమ్మ, సుమిత్ర తదితరులు పాల్గొన్నారు.

# పివిఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్‌వేపై కారు బోల్తా

### ప్రయాణిస్తున్న ముగ్గురికి గాయాలు




**గండిపేట(క్రైం మిర్రర్):** అతివేగంగా కారును నడపడంతో అదుపుచేయలేక డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ సంఘటన గురువారం సాయంత్రం పివిఎన్ఆర్ ఎక్స్‌పెర్స్‌వేపై చోటు చేసుకుంది. రాజేంద్రనగర్ ట్రాఫిక్ సీఐ సి.హెచ్.రాజు తెలిపిన వివరాల ప్రకారం లార్డ్స్ కళాశాల నుంచి బర్కత్‌పూర్ వైపు ఎండి షఫీయాన్ అర్షక్, అల్తాఫ్, అబ్దుల్లాలు టిఎస్09ఈవి5663లో ప్రయాణిస్తున్నారు. వాహనం అతివేగంతో వెళ్లి రోడ్డు మధ్యలోని డివైడర్‌ను ఢీకొట్టడం వల్ల ఈ ప్రమాదం సంభవించింది. దీంతో వాహనం మెహిదీపట్నం నుంచి ఆరాంఘర్ వైపున బోల్తాపడిందన్నారు. ఈ క్రమంలో మూడు మొక్కల తొట్టెలు దెబ్బతిన్నాయన్నారు. రోడ్డు మధ్యలో కారు బోల్తాపడడంతో పివిఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్‌వేపై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. జేసీబీతో ప్రమాదానికి గురైన కారును పక్కకు తీయించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

# మంత్రి కొండా సురేఖ హిందువులకు క్షమాపణ చెప్పాలి

### బిజెపి రంగారెడ్డి జిల్లా ఐటీ ఇంచార్జ్ చేడం వెంకటరమణ గుప్తా

**గండిపేట(క్రైం మిర్రర్):** హిందువుల పట్ల అనుచిత వాఖ్యలు చేసిన దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని భారతీయ జనతా పార్టీ రంగారెడ్డి జిల్లా ఐటీ ఇంచార్జ్ చేడం వెంకటరమణ గుప్తా డిమాండ్ చేశాడు. ఈ సందర్భంగా గురువారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ నాయకులు జై శ్రీరామ్ అంటే డబ్బులు వస్తాయని ఇవి అన్ని వేస్ట్ మాటలు అని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ వాఖ్యానించిందన్నారు. ఇది హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా ఉన్నాయన్నారు. జై శ్రీరామ్ అనడం హిందువుల ఆరాధ్యమని తెలుసుకోవాలన్నారు. అనుచిత వాఖ్యలు చేసిన కొండా సురేఖకు దేవాదాయ శాఖ మంత్రిగా ఉండే అర్హత లేదన్నారు. వెంటనే రాజీనామా చేసి హిందువులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మరోసారి ఇలాంటి అనుచిత వాఖ్యలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు.





# ఘనంగా చత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహావిష్కరణ

**క్రైమ్ మిర్రర్ వలిగొండ:**యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని మొగిలిపాక గ్రామం లో హిందూ స్వరాజ్య స్థాపకుడు పోరట యోధుడు చత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహా ఆవిష్కరణ మొగిలిపాక అభివృద్ధి ప్రదాత ముద్దసాని కిరణ్ రెడ్డి జన్మదిన వేడుకలను బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా తెలంగాణ రాష్ట్ర తొలి శాసనసభ మాజి స్పీకర్,సిరికొండ మధుసూధనచారి భువనగిరి మాజి శాసన సభ్యులు పైళ్ల శేఖర్ రెడ్డి హాజరై చత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,మహారాష్ట్రలో సాధారణ కుటుంబంలో పుట్టిన శివాజీ స్వశక్తితో ఒక రాజ్యాన్ని స్థాపించి, దేశంలోనే బహుజనుల చీకటి బతుకులలో దారి దివిటి అయ్యాడని, స్వరాజ్యంలో రైతులు, స్త్రీలు,గిరిజనలు, సబ్బండ వర్గాలను భాగస్వామ్యం చేసి బహుజన నిర్మాణం ఎలా ఉండాలో శివాజీ పాలన నేటి పాలకులకు ఆదర్శమని వారు అన్నారు.ఆతర్వాత అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ సురకంటి వెంకట్ రెడ్డి జిల్లా నాయకులు మొగుళ్ళ శ్రీనివాస్ గౌడ్ బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు తుమ్మల వెంకట్ రెడ్డి బిఆర్ఎస్ పార్టీ సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు పడమటి మమతా నరేందర్ రెడ్డి ఏజెఆర్ ఫౌండేషన్ అధినేత ఎలిమినేటి జంగారెడ్డి వివిధ గ్రామాల సర్పంచులు గ్రామ సర్పంచ్ జెడిగే బుచ్చయ్య,ఉప సర్పంచ్ ఎస్.కె సయ్యద్ పాష మాజీ ఎంపీటీసీ మొగిలిపాక శ్రీలత రమేష్ మండల గ్రామ నాయకులు గ్రామ యువకులు గ్రామ ప్రజలు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# అక్రమంగా తరలిస్తున్న 9 టన్నుల పిడిఎస్ రైస్ సీజ్ చేశాము

### హయత్ నగర్ ఇన్స్పెక్టర్ నాగరాజు గౌడ్

**ఎల్బీనగర్ మే 7, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి :** హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ ఆర్ ఆర్ పిస్తా హౌస్ హోటల్ వెనకాల రెండు లారీలను నిలిపి చిన్న వాహనాల ద్వారా అక్రమంగా వ్యాపారం చేస్తున్న వారి వద్ద నుండి బియ్యాన్ని సేకరించి రెండు లారీలలో లోడ్ చేస్తుండగా రైడ్ చేసి 9 టన్నుల పిడిఎస్ బియ్యాన్ని సీజ్ చేసి నలుగురు నిందితులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసాము అని హయత్ నగర్ ఇన్స్పెక్టర్ నాగరాజు గౌడ్ తెలిపారు. యాఖత్పురాకు చెందిన సయ్యద్ ఖాజా నజీర్, హయత్ నగర్ కు చెందిన అమీర్ భాష, చంద్రాయన గుట్టకు చెందిన మహమ్మద్ సాబీర్, లారీ డ్రైవర్లు గుజరాత్ కు చెందిన సిద్ధిక్ భాయ్, మహారాష్ట్రకు చెందిన కోడేప్ మహేంద్ర లను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నాము అని ఇన్స్పెక్టర్ నాగరాజు గౌడ్ తెలిపారు. బాలాపూర్ కు చెందిన షేక్ అఖిల్ ప్రస్తుతం పరారీలో ఉన్నాడు అని అతని కోసం గాలిస్తున్నాము అని అన్నారు. నిందితుల నుండి రెండు లారీలు, అశోక్ లేలాండ్ దోస్త్ వెహికల్, సుజుకి ద్విచక్ర వాహనం, 6 మొబైల్ ఫోన్లు సీజ్ చేశాను అని నాగరాజు గౌడ్ అన్నారు. ?

# ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై తక్షణ చర్యలు తీసుకోవాలి

### ప్రభుత్వం విద్యార్థుల సర్టిఫికెట్లు విడుదల చేయించాలి

### ది సిటిజన్ కౌన్సిల్ ప్రధాన కార్యదర్శి షేక్ ఆరిఫ్ మొహమ్మద్



**గండిపేట(క్రైం మిర్రర్):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై తక్షణ చర్యలు తీసుకోవాలని ది సిటిజన్ కౌన్సిల్ ప్రధాన కార్యదర్శి షేక్ ఆరిఫ్ మహమ్మద్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్, పోస్ట్ మ్యాట్రిక్ స్కాలర్‌షిప్ బకాయిలు సుమారు 9 వేల కోట్ల నుంచి 12 వేల కోట్ల వరకు పెండింగ్‌లో ఉన్నాయ. ఈ కారణంగా సుమారు ఐదు లక్షల మంది విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వం నుంచి రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల కాకపోవడంతో అనేక ప్రైవేట్, అనుబంధ విద్యాసంస్థలు విద్యార్థుల అసలు సర్టిఫికెట్లు నో డ్యూస్ క్లియరెన్స్‌లను నిలిపివేస్తున్నాయన్నారు. దీని వల్ల విద్యార్థుల ఉద్యోగ అవకాశాలు, ఉన్నత విద్య ప్రవేశాలు, వృత్తి భవిష్యత్తు దెబ్బతింటోందన్నారు. ఇలాంటి చర్యలు భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21-ఏ , ఆర్టికల్ 46 ఆత్మకు విరుద్ధంగా ఉండటమే కాకుండా, యూజీసీ మార్గదర్శకాలు, న్యాయపరమైన సూత్రాలకు కూడా వ్యతిరేకం న్నారు. పెండింగ్ బకాయిల చెల్లింపుపై అధికారిక హామీ ఇవ్వాలన్నారు. ఫీజు బకాయిల పేరుతో విద్యార్థుల అసలు సర్టిఫికెట్లు నిలిపివేయవద్దని అన్ని కళాశాలలకు ఆదేశాలు జారీ చేయాలన్నారు. బకాయిల క్లియరెన్స్‌కు సమయపాలిత కార్యాచరణ ప్రణాళిక ప్రకటించాలన్నారు. ప్రభుత్వం, విద్యాసంస్థల మధ్య ఉన్న ఆర్థిక లేదా పరిపాలనా ఆలస్యాల వల్ల విద్యార్థుల భవిష్యత్తు నష్టపోకూడదన్నారు. విద్యార్థుల విద్యా, ఉద్యోగ భద్రత కోసం తక్షణ జోక్యం అవసరంన్నారు. అందరికీ విద్య అనే లక్ష్యంతో ది సిటిజన్స్ కౌన్సిల్ నిరంతరం కట్టుబడి పనిచేస్తోందన్నారు.

# తేమ, తాలు , తరుగు పేరుతో రకరకాలుగా క్వింటాలుకు రెండున్నర కిలోల నుండి నాలుగున్నర కిలోల వడ్లను తీయడం విరమించుకోవాలి

**ఐకేపీ సెంటర్లలో, మార్కెట్ కేంద్రాలలో రైతులకు ధాన్యం నిలువ కోసం షెడ్లు, టార్పాల్లు, తాగడానికి నీళ్లు ఏర్పాటు చేయాలని**

**ఐకేపీ కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని వెంటనే కాంటాలు వేసి, మిల్లులకు తరలించాలి**

**సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్. వీరయ్య డిమాండ్.**



**భువనగిరి, మే 07(క్రైమ్ మిర్రర్):** తేమ, తాలు, తరుగు పేరుతో క్వింటాలుకు రెండున్నర కిలోల నుండి నాలుగున్నర కిలోల వడ్లను రైతుల నుండి దండుకోవడాన్ని విరమించుకోవాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్. వీరయ్య డిమాండ్ చేశారు. ఐకేపీ సెంటర్లలో, మార్కెట్ కేంద్రాలలో రైతులకు ధాన్యం నిలువ కోసం షెడ్లు, టార్పాల్లు(కవర్లు), తాగడానికి నీళ్లు ఏర్పాటు చేయాలని వారు ప్రభుత్వానికి సూచించారు. గురువారం భువనగిరి మండల పరిధిలోని అనాజిపురం గ్రామంలోని ఐకేపీ కేంద్రాన్ని సీపీఎం నాయకత్వంతో కలిసి సందర్శించిన అనంతరం అక్కడున్న రైతులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్న అనంతరం వీరయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఒక్క గింజ కూడా వదలకుండా కొనుగోలు చేస్తామని రైతులెవ్వరు కూడా భయపడవద్దని బాధపడవద్దని ధైర్యంగా ఉండమని ఊకదంపుడు ముచ్చట్లు చెప్తున్నారని అన్నారు. మరి నిన్న మొన్న అకాల వర్షాలతో పెద్ద ఎత్తున రైతులు వరి ధాన్యం తడిసి ఇబ్బందులు పడుతుంటే ఒక్క మంత్రి కూడా రైతు మార్కెట్ కేంద్రాలను ఎందుకు సందర్శించలేదని ప్రశ్నించారు. అధికారులేమో ఒక దిక్కు రైతులను భయపడొద్దు అని చెప్తున్నారు మరి వానలో ధాన్యం తడిసి మొలకలు వస్తా ఉంటే రైతులు భయపడకుండా బాధపడకుండా ఎట్లా ఉంటారని అన్నారు. ఎర్రటి ఎండలో తమకుప్ప దగ్గర రైతులు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎట్లా కూర్చుంటారని కనీసం ఆయా మార్కెట్లో నిలువ నీడవలేక, తాగడానికి మంచి నీరు లేక కనీస సౌకర్యాలు కూడా లేకుండా వానొస్తే ధాన్యం తడవకుండా మొలకెత్తకుండా నిల్వ చేయడానికి షెడ్యూల్ ఏర్పాటు ప్రభుత్వము ఏర్పాటు చేయాలి కదా అని ప్రశ్నించారు. ఐకెపి సెంటర్ అంటున్నారు కానీ ఎక్కడ ఐకెపి సెంటర్ కనబడటం లేదు ఎవరిదో భూమి ఆ భూమి మీద రైతులు ధాన్యం కుప్పలు పోసుకుంటున్నారు. దీనికి ఐకెపి సెంటర్ అని పేరు ఎట్లా పెడతారని ప్రశ్నించారు. ఒక గ్రౌండ్ ఏర్పాటు చేసి పెద్ద పెద్ద షెడ్లు నిర్మాణం చేసి ధాన్యం పెట్టుకునే అవకాశాన్ని కల్పించి, అందులో రైతులకు అన్ని వసతులు కల్పించినప్పుడే ఐకేపీ సెంటర్ అంటే అర్థం ఉంటుందని తెలిపారు. ధాన్యమం మార్కెట్టుకు తెచ్చినప్పుడు వాటిని నిల్వ చేయడానికి వర్షమొస్తే పైనుండి కప్పడానికి టార్పాలు(పట్టాలు) ప్రభుత్వం ఇవ్వకపోవడం వల్ల ఒక్కొక్క రైతు ఒక్క పంటకు మూడు వేల నుండి ఆరు వేల రూపాయల వరకు కిరాయిలు చెల్లిస్తున్నారని అన్నారు. ఒక్కసారి వడ్లు తెచ్చి మార్కెట్లో కుప్ప పెడితే నెల రోజులకు పైగా సీరియల్ వచ్చేవరకు పడుతుందని ఆ నెల రోజులపాటు రైతులు ఆకాశం వైపు చూసి ఏడవాలో నవ్వాలో దిక్కుతోచని పరిస్థితిలో ఉంటూ ఎప్పుడు వానొస్తదో అనే భయంతో బతుకుతవలసి పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వెలిబుచ్చారు. కానీ ప్రభుత్వము రైతులకు భరోసా కల్పించి మార్కెట్ కి వచ్చిన ధాన్యాన్ని వెనువెంటనే కాంటవేసి లారీలకు ఎత్తి మిల్లులకు ఎందుకు తీసుకపోవడం లేదని అన్నారు. చాలా చోట్ల కాంటవేసిన ధాన్యం కూడా లారీకి ఎక్కించడం వాటిని మిల్లులకు తీసుక పోకపోవడం పరిపాటిగా మారిందని అన్నారు. మిల్లుకు పోయేవరకు ధాన్యం రక్షణ బాధ్యత రైతుదే అని చెప్పడం ఎట్లా కరెక్ట్ అని అన్నారు. ప్రాణాలను పణంగా పెట్టి పంటను పండించుకునే దుస్థితి ఎప్పటికీ రైతులకు రాష్ట్రంలో ఉన్నదని అన్నారు. ఎప్పుడైతే రైతుల సమస్యలు పరిష్కారం అవుతాయో అప్పుడూ మన రాష్ట్రం బాగుపడుతుందని తెలిపారు. రాష్ట్రంలో రైతులు సమస్యల సుడిగుండం నుండి ఎప్పుడు ఘట్టెకుతాడని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కేవలం రైతు భరోసా ఇస్తున్నామని చెప్పి మిగిలిన సమస్యలు పట్టించుకోక పోవడం వల్ల ఈరోజుకు రైతు కుటుంబాలు రోడ్డు పాలవుతున్నాయని అన్నారు. ప్రభుత్వం రైతుల విషయంలో బాధ్యతరహితంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. ప్రభుత్వం మాటలు చెప్పడం కాకుండా చేతల్లో పని చూపించాలని చెప్పారు. ఇప్పుడున్న ఆధునిక సమాజంలో సరిపడా లారీలు, మిల్లులు ఉన్న 30 నుండి 40 రోజులు వరకు రైతుల ధాన్యం కొనుగోలు కోసం ఎదురుచూసే పరిస్థితి వస్తుందని ప్రశ్నించారు. ఈ పరిస్థితి నుండి బయటపడేసి రైతులకు పూర్తి భరోసా కల్పించే విధంగా ప్రభుత్వమే బాధ్యత తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల ఒక్క రూపాయి కూడా రైతు నష్టపోకుండా చూడాలని, రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించే విధంగా ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలని సూచించారు. రైతులు ఐకేపీ, మార్కెట్ కేంద్రాలలో ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున పోరాటాలు చవిచూడవలసి వస్తుందని వీరయ్య ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ్మా, మండల కార్యదర్శి పల్లెర్ల అంజయ్య, మండల కార్యదర్శివర్గ సభ్యులు ఏదునూరి మల్లేశం, మండల నాయకులు గునుగుంట్ల శ్రీనివాస్, గ్రామ సర్పంచ్ రాయపురం సురేష్, మండల నాయకులు పాండాల మైసయ్య, జిట్ట అంజిరెడ్డి, శాఖ కార్యదర్శి కొడాలి కృష్ణ, నాయకులు పిట్టల వెంకటేష్, యండి.రఫీక్, గంగదారి భాను, రైతులు పన్నాల నరెందర్ రెడ్డి, బొల్లెపల్లి రామచంద్రం, గోగు పోషయ్య, బోయపల్లి దామోదర్ రెడ్డి, పిట్టల చంద్రయ్య, గడుసు నరేష్, శ్రీరాం చంద్రకళ, గోగు మంగమ్మ, బొల్లెపల్లి మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.



## మే 10న జరిగే ప్రధాని నరేంద్రమోడీ బహిరంగ సభను జయప్రదం చేద్దాం

**బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పంతంగి రాజ్‌భూపాల్‌గౌడ్, జాతీయ కార్యవర్గ సభ్యులు గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డిలు**



గండిపేట(క్రైం మిర్రర్): సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరగనున్న ప్రధాని నరేంద్రమోడీ జన ఆగ్రహ బహిరంగ సభను విజయవంతం చేయాలని బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పంతంగి రాజ్‌భూపాల్‌గౌడ్, జాతీయ కార్యవర్గ సభ్యులు గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డిలు అన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గ సన్నాహక సమావేశాన్ని జిల్లా కార్యాదర్శి పొన్నామోని మల్లేష్‌యాదవ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథులుగా పాల్గొని మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోడీ తొమ్మిది వేల కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకాంరం చుట్టడానికి తెలంగాణకు రావడం జరుగుతంందన్నారు. అదే విధంగా బీజేపీ వచ్చే సార్వత్రిక ఎన్నికలలో తెలంగాణలో విజయం సాధించడం తధ్యమని, వికసిత్ తెలంగాణ లక్ష్యంగా పని చేస్తుందని ఈ లక్ష్యాన్ని సాకారం చేయడం కోసం ప్రధానమంత్రి నరేంద్రమోడీ అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. నియోజకవర్గంలోని ప్రతి బూత్ నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చి మోడీ బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా పదాధికారులు, అసెంబ్లీ, డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించకుంటే... 18 నుంచి నిరవదిక సమ్మె చేపడతాం.

**వీవోఏ ల సంఘం జిల్లా నాయకురాలు పార్వతీబాయి**



**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించకుంటే ప్రత్యక్ష ఆందోళన చేపడతామని వీవోఏ ల సంఘం జేఏసీ జిల్లా నాయకురాలు రాజపుత్ర పార్వతీబాయి హెచ్చరించారు. నేలకొండపల్లి ఐకేపీ ఏపీయం కు గురువారం సమ్మె నోటీసు ను అందించారు. పెన్ డౌన్ కార్యక్రమం ప్రారంభించారు. కార్యాలయంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. వీవోఏ లకు కనీస వేతనం రూ.20 వేల ను చెల్లించాలని డిమాండ్ చేశారు. సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. అర్హత కలిగిన వారికి సీసీ లుగా పదోన్నతి కల్పించాలన్నారు. సాధారణ ఆరోగ్య భీమా సౌకర్యం రూ.20 లక్షలు, ట్యాబ్ సౌకర్యంకల్పించాలని, 58 జీవో ను సవరించాలని డిమాండ్ చేశారు. దీర్ఘకాలికంగా పెండింగ్లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని అన్నారు. లేని పక్షంలో ఈ నెల 18 నుంచి నిరవదిక సమ్మె ను చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు గుత్తికొండ రాణి, పి.శ్రీలక్ష్మి, సి.హెచ్.సుధారాణి, ఎస్.ఉమామహేశ్వరీ, బీ.రేణుక, సత్యవతి, ప్రమీలా, బాజా వనజ, కృష్ణకుమారి, శైలజ, సుజాత, కె.పుష్పావతి, మరియమ్మ, బందెల రూప, రాజ్యలక్ష్మి, కోటమ్మ తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల అత్మీయ సమ్మేళనం..

**కేశంపేట,(క్రైమ్ మిర్రర్):** మండల పరిధిలోని కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1994-95 లో పదవ తరగతి చదివిన విద్యార్థులు గురువారం మండల కేంద్రంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. విద్యార్థులు విద్యార్థి దశ జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. నాడు చదువుకునే రోజుల్లో పడినటువంటి కష్టసుఖాలను అధిగమించి ఉన్నత చదువులు చదువుకుని మంచి స్థాయి చేరుకోవడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. తమ బ్యాచ్ను సంతాపూర్ సర్పంచ్ అంజయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పొందడంతోపాటు మరో ఆరు మంది మిత్రులు చనిపోయిన వారికి నివాళ్లు అర్పించారు.అనంతరం సరదాగా ఆటపాటలు, నృత్యలతో అలరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



## చిర్రకుంటలో అగ్ని ప్రమాదం.. రూ.15 లక్షల ఆస్తి నష్టం



**మందమర్రి మే 7 (క్రైమ్ మిర్రర్):** దైవదర్శనానికి కుటుంబంతో కలిసి వెళ్లిన రైతు ఇంట్లో గ్యాస్ సిలిండర్ పేలి అగ్నిప్రమాదం సంభవించిన ఘటన కన్నెపల్లి మండలం చిర్రకుంట గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఇల్లు పూర్తిగా దగ్ధమవడంతో పాటు సుమారు రూ.15 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు.గ్రామానికి చెందిన సంద్ర వెంకటస్వామి వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గురువారం ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి ఎల్లారం పోచమ్మ ఆలయానికి దైవదర్శనానికి వెళ్లారు. వారు వెళ్లిన కొద్దిసేపటికే ఇంటి నుంచి పొగలు ఎగసిపడటాన్ని గమనించిన స్థానికులు వెంటనే కుటుంబ సభ్యులకు, బెల్లంపల్లి అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు.అప్పటికే మంటలు ఇంటి అంతటా వ్యాపించాయి. స్థానికులు నీళ్లు చల్లి మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. ఇంటి పక్కన ఉన్న మరో ఇంటికి కూడా మంటలు వ్యాపించగా గ్రామస్తులు అప్రమత్తమై అదుపు చేశారు. అనంతరం అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకురావడంతో పెను ప్రమాదం తప్పింది.అయితే అప్పటికే ఇంట్లోని టీవీ, ఫ్రిజ్, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు, బంగారం, వెండి ఆభరణాలు, నగదు అగ్నికి ఆహుతయ్యాయి. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు వేడుకున్నారు.ఘటనాస్థలిని ఎంపీడీవో రాజేశ్వర్, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ రాథోడ్ గణపతి సందర్శించి వివరాలు సేకరించారు. బాధిత కుటుంబానికి తక్షణ సాయంగా రూ.5 వేల నగదు, బియ్యం, నిత్యావసర సరుకులను అందజేశారు. ప్రభుత్వ పరంగా నష్టపరిహారం అందించేలా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గండి రామచందర్, సర్పంచ్ శ్రీలత తిరుపతి, కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.





## వైద్యభారానికి సహాయ ఊరట

**పేద కుటుంబానికి అండగా ముఖ్యమంత్రి సహాయ నిధి**

**బచ్చలకూరి చరణ్ కి రూ5.00 లక్షల ఎల్ ఓ సి అందజేత**

**మంత్రి పొంగులేటి చొరవతో ఆర్థిక వెసులుబాటు**

**క్యాంపు కార్యాలయం ఇంచార్జి భీమీరెడ్డి శ్రీనివాస్ రెడ్డి**

**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** కూసుమంచి మండలంలోని గురువారం మునిగేపల్లి గ్రామానికి చెందిన బచ్చలకూరి చరణ్ అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు జొన్నలగడ్డ రవి కుమార్ సమస్యను తుంబూరు దయాకర్ రెడ్డి ద్వారా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దృష్టికి తీసుకు వెళ్లడం జరిగింది. వెంటనే స్పందించిన మంత్రి బాధిత కుటుంబానికి ఎల్ఓసి మంజూరు చేపించడం జరిగింది కష్టకాలంలో తమ కుటుంబాన్ని ఆదుకున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కి సహకరించిన జొన్నలగడ్డ రవి కుమార్, దయాకర్ రెడ్డి కు భీమీరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మరియు మునిగేపల్లి గ్రామ కాంగ్రెస్ నాయకులు కు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు,ఈ కార్యక్రమంలో, జొన్నలగడ్డ రవికుమార్, మండల కాంగ్రెస్ నాయకులు మునిగేపల్లి కాంగ్రెస్ నాయకులు గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మీగూడలో విషాదం

**అగ్నిప్రమాదంలో సజీవ దహనం అయిన యువకుడు**





**గండిపేట(క్రైం మిర్రర్):** అగ్నిప్రమాదంలో ఓ యువకుడు సజీవ దహనం అయిన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బీహార్‌కు చెందిన వికాస్(21) కాటేదాన్ పారిశ్రామికవాడలో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తు లక్ష్మీగూడ బృందావన్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. గురువారం తెల్లవారుజామున షార్ట్ సర్క్యూట్ కారణంగా ఇంట్లో మంటలు చెలరేగాయి. బెడ్‌రూమ్‌లో నిద్రిస్తున్న వికాస్ వాటిని గమనించి బయటకు వచ్చేందుకు ప్రయత్నించిన వీలు కాలేదు. అతడు హాల్‌లో మంటల్లో చిక్కుకోనిపడిపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు గమనించి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో వారు సంఘటన స్థలానికి చేరుకోని మంటలను అదుపులోకి తెచ్చారు. మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు మృతదేహాన్ని స్వాదీనం చేసుకోని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# పునర్వినియోగ ప్లాస్టిక్‌తో స్థిరమైన పరిష్కారాలు

## తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

## కాటేదాన్‌లో నిర్మాన్ ఈకో ప్లాస్టిక్ సొల్యూషన్స్ తయారీ కేంద్రం ప్రారంభం



**గండిపేట(క్రైం మిర్రర్):** కాటేదాన్ పారిశ్రామిక వాడలో నిర్మాన్ ఈకో ప్లాస్టిక్ సొల్యూషన్స్ తయారీ కేంద్రాన్ని గురువారం తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్, మాజీ ఆర్టీఐ కమిషనర్ ముట్టంశెట్టి విజయనిర్మలలు ప్రారంభించారు. స్థిరమైన, పర్యావరణహిత పరిష్కారాల వైపు సమాజం మారాల్సిన అవసరం ఉందన్నారు. నిర్మాన్ ఈకో ప్లాస్టిక్ సొల్యూషన్స్ సంస్థ పారపబోయబడిన ప్లాస్టిక్ వ్యర్థాలను అధిక బలమున్న, పర్యావరణహిత టైల్స్, ఇటుకలుగా మార్చుతుందన్నారు. ఇవి పార్కింగ్ ప్రదేశాలు, ఫుట్‌పాత్‌లు, డ్రై వ్‌వేలు, పేపర్స్, అధిక రద్దీ ఉన్న బహిరంగ ప్రదేశాల్లో వినియోగానికి అనుకూలంగా రూపొందించబడుతున్నాయన్నారు. నిర్మాన్ ఉత్పత్తులు సాంప్రదాయ ఇటుకలు, టైల్స్ కంటే 20 రెట్లు ఎక్కువ బలంగా ఉంటాయన్నారు. ఇవి నీరు చోరబడని, వాతావరణ మార్పులను తట్టుకునే, తక్కువ నిర్వహణ అవసరమయ్యే విధంగా ఉండి, సుమారు 90--110 సంవత్సరాల వరకు మన్నికగా నిలుస్తాయన్నారు. విస్తృతమైన పరిశోధనలు, పరీక్షల అనంతరం ఈ టైల్స్ 120 టన్నుల వరకు బరువును భరించగల సామర్థ్యాన్ని కలిగి ఉన్నట్లు నిరూపితమైందన్నారు. హైదరాబాద్ నగరంలో ఒక్కరోజుకే 1000 టన్నులకు పైగా ప్లాస్టిక్ వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయని, నీటి వనరులు లేదా దాహనం చేయబడే ప్రదేశాల్లోకి చేరుతుందన్నారు. వేగంగా పెరుగుతున్న నగరీకరణ, ప్లాస్టిక్ వినియోగం నేపథ్యంలో, స్థిరమైన వ్యర్థ నిర్వహణతో పాటు దీర్ఘకాలిక మౌలిక వసతుల అవసరం అత్యంత కీలకంగా మారిందన్నారు. ఈ సంస్థ వెనుక ఉన్న వ్యక్తి వ్యవస్థాపకుడు రిషీతోష్ సింగ్ గిల్ ఆయన 2018లో కంప్యూటర్ సైన్స్ చదవడానికి అమెరికాకు వెళ్లి అక్కడ ఐదు సంవత్సరాలు కార్పొరేట్ రంగంలో పని చేశాడన్నారు. విజయవంతమైన ఉద్యోగ జీవితం ఉన్నప్పటికీ, ఆయన దృష్టి ఎప్పుడూ వ్యాపార సృజనాత్మకత, స్థిరమైన అభివృద్ధి పైనే నిలిచిందన్నారు. అమెరికాలో ఉన్న సమయంలో అక్కడి సర్క్యులర్ ఎకానమీ విధానం ఆయనను ఎంతో ఆకట్టుకుందన్నారు. అమెరికాలో మౌలిక వసతులు దశాబ్దాల పాటు కొన్ని సందర్భాలల్లో శతాబ్దాల పాటు ఎలా స్థిరంగా నిలుస్తున్నాయో ఆయన సంవత్సరాల పాటు అధ్యయనం చేశారన్నారు. ప్రపంచంలో అత్యంత విస్తృతంగా ఉపయోగించే మౌలిక వసతుల ఉత్పత్తులలో ఒకటైన టైల్స్‌కు పర్యావరణహిత, స్థిరమైన ప్రత్యామ్నాయాన్ని అందించాలనే లక్ష్యంతో ఆయన భారతదేశానికి తిరిగి వచ్చి నిర్మాన్ ఈ కో ప్లాస్టిక్ సొల్యూషన్స్‌ను స్థాపించారన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవస్థాపకుడు రిషీతోష్ సింగ్ గిల్, తదితరులు పాల్గొన్నారు.



## మృతుని కుటుంబనికి ఆర్థిక సహాయం

**నూతనకల్( క్రైమ్ మిర్రర్):** మండల పరిధిలోని పెదనెమిల గ్రామానికి చెందిన చిత్తలూరి రమేష్ ఇటీవల అనారోగ్యనీకి గురై మృతి చెందారు.మృతుని కుటుంబానికి గురువారం మండల యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు నల్లెద తిరుమల్ రెడ్డి పరామర్శించారు.అనంతరం 5వేలు ఆర్థిక సహాయం అందించారు.ఈనాటి కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు గూగులోతు బాలాజీ నాయక్,నల్లెద నరేష్ రెడ్డి ,చిత్తలూరి ఉమేష్ గౌడ్,సంతోష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## కణతాల రాము కుటుంబానికి ఆసరాగా నిలిచిన పదవ తరగతి క్లాస్మేట్స్

### రాము తల్లికి పదివేలు సహాయం



**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం కోనాయిగూడెం గ్రామానికి చెందిన కణతాల రాము ఇటీవల ఖమ్మం మామిళ్ళగూడెంలో అనుమానాస్పదంగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న జడ్పీహెచ్ఎస్ ఆరెగూడెం లో 2012-13 టెన్త్ బ్యాచ్ చదివిన క్లాస్మేట్స్ కణతాల రాము దశదిన కర్మ సందర్భంగా గ్రామానికి వచ్చి రాము చిత్రపటానికి ఘనంగా నివాళు లర్పించారు. వారి కుటుంబానికి పదివేల రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. రాము అతని కుటుంబం మొత్తం మృతి చెందటం పట్ల తీవ్ర దిగ్భ్రాంతి గురైనారు. రాము తల్లి లక్ష్మి కుటుంబ సభ్యుల నీ ఓదార్చారు. ఈ కార్యక్రమంలో రాము క్లాస్మేట్స్ షేక్ భాషా మార్తి వెంకటేశ్ మీగడ నాగరాజు నీలకంఠం నవీన్ బొడ్డుపల్లి వినయ్ పోతుగంటి కిషోర్ దొంతగని లక్షణ్ రావు మేడ గోపి ఉల్లోజు పవన్ దొడ్డరపు వెంకటాద్రి చిర్రా రమేష్ పొద్దుటూరి వెంకటేశ్ దేగాటి నరేంద్రబాబు ఏలూరి రాజేశ్వరి కోలేటి వినీల కాస్తల శైలజ దొనకొండ మధురవాణి లొడుగు స్వాతి బోయిన లీలా బోయిన ప్రతిష్ట తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ షాపుల ద్వారా జొన్న, మెక్కజొన్న పంపిణీ

**కోదాడ మే 07 క్రైమ్ మిర్రర్ :** కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మెక్కజొన్న, జొన్న పంటలకు మద్దతు ధర కల్పించేందుకు పాటు, సేకరించిన ధాన్యాన్ని రేషన్ దుకాణాల ద్వారా ప్రజలకు పంపిణీ చేయాలని నిర్ణయించింది.ఈ నేపథ్యంలో బీహారంగ్ మార్కెట్ యార్డులో వేలానికి వచ్చిన జొన్నలను ప్రభుత్వం కొనుగోలు చేసింది. అనంతరం వాటిని సివిల్ సప్లైస్ శాఖ ఆధ్వర్యంలో రేషన్ దుకాణాలకు తరలిస్తున్నారు. ప్రజలకు నాణ్యమైన ధాన్యం అందించడంతో పాటు రైతులకు గిట్టుబాటు ధర లభించేలా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు.రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, పంటలకు సరైన ధర కల్పించేందుకు చర్యలు కొనసాగుతాయని పేర్కొన్నారు. అలాగే ప్రజలకు పోషకాహారం అందించాలనే ఉద్దేశంతో రేషన్ ద్వారా జొన్నలు, మెక్కజొన్న పంపిణీ చేపడుతున్నట్లు వెల్లడించారు

# ఐపిఎల్ బెట్టింగ్‌ల అడ్డాగా మారిన సురాపానం

## అక్రమ దందాపై ఎక్సైజ్ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి




**మర్రిగూడ(క్రైమ్ మిర్రర్):** మర్రిగూడ మండల కేంద్రంలోని సురాపానం వైన్స్ యజమాన్యం, నిబంధనలను తుంగలో తొక్కి, యువత బలహీనతలను పెట్టుబడిగా మార్చుకుంటూ, సాగిస్తున్న అక్రమ వ్యాపార సామ్రాజ్యంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సాధారణంగా మద్యం విక్రయాలకు మాత్రమే పరిమితం కావాల్సిన వైన్స్ షాపులు, నేడు అత్యాధునిక ప్రొజెక్టర్లు, లైవ్ స్క్రీన్ల ఏర్పాటుతో మినీ స్టేడియాలను తలపిస్తూ, ఐపిఎల్ క్రికెట్ బెట్టింగ్‌లకు ప్రధాన కేంద్రాలుగా మారుతుండటం ఆందోళనకరం. యువతను మద్యం మత్తులోకి దించడమే కాకుండా, క్రికెట్ వ్యామోహాన్ని ఆసరాగా చేసుకుని, వారిని బెట్టింగ్ ఉచ్చులోకి లాగుతూ లక్షలాది రూపాయలు కొల్లగొడుతున్న ఈ వైన్స్ తీరుపై, స్థానిక ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి యువతను వ్యసనాలకు దూరంగా ఉంచి, వారి భవిష్యత్తును తీర్చిదిద్దాలని సంకల్పిస్తుంటే, కొందరు స్థానిక నాయకుల అండదండలతో సాగుతున్న, ఈ అక్రమ దందా ఆయన ఆశయాలకు తూట్లు పొడుస్తోంది. కేవలం వైన్స్ పరిసరాల్లోనే కాకుండా, ఇక్కడి నుండి గ్రామ గ్రామాన ఉన్న బెల్టు షాపులకు విచ్చలవిడిగా మద్యం సరఫరా చేస్తూ, పల్లెల్లో సైతం ప్రశాంతతను దెబ్బతీస్తున్నారు. నిబంధనల ప్రకారం వైన్స్ ప్రాంగణంలో ఎటువంటి వినోద సాధనాలు ఉండకూడదని తెలిసినా, అధికారుల కళ్లు గప్పి, వారి ఉదాసీనతను ఆసరాగా చేసుకుని, బహిరంగంగానే ప్రొజెక్టర్లు ఏర్పాటు చేసి బెట్టింగ్‌లను ప్రోత్సహించడం గమనార్హం. ఈ అక్రమ వ్యవహారం వల్ల ఎంతోమంది యువకులు తమ కష్టార్జితాన్ని పందాల రూపంలో పోగొట్టుకుని రోడ్డున పడుతుంటే, వైన్స్ యజమానులు మాత్రం కాసుల వర్షంలో తడుస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఎక్సైజ్ అధికారులు, ఉన్నతాధికారులు స్పందించి మర్రిగూడ మండలంలోని ఈ అక్రమ ఐపిఎల్ బెట్టింగ్ అడ్డాలపై ఆకస్మిక దాడులు నిర్వహించాలని, లైవ్ స్క్రీన్లను జప్తు చేసి, బెల్టు షాపులకు అక్రమంగా మద్యం తరలిస్తున్న వైన్స్ లైసెన్సులను రద్దు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. యువత భవిష్యత్తును చిన్నాభిన్నం చేస్తున్న ఇటువంటి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయకపోతే భవిష్యత్తులో ఈ ప్రాంతం నేరాలకు నిలయంగా మారే ప్రమాదం ఉందని విశ్లేషకులు హెచ్చరి స్తున్నారు.

# ఖమ్మంకు క్రికెట్ కళకు "రఘురాం" కసరత్తు

## స్టేడియం వేటలో ఎంపీ రామసహాయం

### రఘునాథపాలెం మండలం జింకల తండా, ఖమ్మం రూరల్ తల్లంపాడు వద్ద ?స్వయంగా గుట్టల పైకి ఎక్కి స్థలాల పరిశీలన



**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** నగర సమీపంలో క్రికెట్ స్టేడియం నిర్మాణానికి కావాల్సిన సాధ్యాసాధ్యాలపై ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. జిల్లా క్రికెట్ అసోసియేషన్ కోరిక మేరకు..గురువారం ఆయన రఘునాథపాలెం మండలం జింకల తండా సమీపంలో గుట్టల ప్రాంతం, ఖమ్మం రూరల్ మండలం తల్లంపాడు వద్ద హైవే వెంట ఉన్న కొండల ప్రాంతాల్లో సుడిగాలి పర్యటన చేశారు. స్టేడియం నిర్మాణానికి అనువైన స్థలం కోసం అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపారు.

**శ్రమకోర్చి.. గుట్టపైకి..** స్టేడియం నిర్మాణానికి విశాలమైన, అనువైన భూమిని గుర్తించే క్రమంలో ఎంపీ రఘురాం రెడ్డి శ్రమను లెక్కచేయకుండా రాళ్లు, రప్పలతో నిండిన గుట్టపైకి కాలినడకన ఎక్కారు. ఎగుడుదిగుడు మార్గాల గుండా ప్రయాణించి, గుట్టపై నుంచి చుట్టుపక్కల ప్రాంతాలను నిశితంగా పరిశీలించారు. ఖమ్మం క్రీడాకారుల కలల ప్రాజెక్టు అయిన క్రికెట్ స్టేడియం నిర్మాణానికి పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్నట్లు ఎంపీ తెలిపారు. ఈ పర్యటనలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాస రెడ్డి, డీవైఎస్ఓ సునీల్ రెడ్డి, రఘునాథపాలెం ఎమ్మార్వో ఎస్.శ్వేత, ఖమ్మం రూరల్ ఎమ్మార్వో విజయేందర్ రెడ్డి, సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## వడ్ల కొనుగోలు మార్కెట్ లను సందర్శించిన సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి

**సంస్థాన్ నారాయణపురం, మే 07(క్రైమ్ మిర్రర్):** యాదాద్రి భువనగిరి జిల్లాసంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో వడ్ల కొనుగోలు కేంద్రాలను సందర్శించడం జరిగింది. ప్రభుత్వపరంగా ధాన్యాన్ని కొనుగోలు చేసి మిల్లర్లకు విక్రయిస్తున్న పరిస్థితులను తెలుసుకొని వేగవంతంగా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని అధికారులను కోరనైనది. దీనిపై మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి కీ, జిల్లా కలెక్టర్, ఇతర అధికారులతో ఎప్పటికప్పుడు ఫోన్లలో మాట్లాడి వరి ధాన్యం కొనుగోలు వేగవంతం చేసి విధముగా రైతులకు ఇబ్బంది కలగకుండా రోజుల తరబడి నిరీక్షణ చేయకుండా త్వరితగతిన కొనుగోలు చేయాలని ఆదేశాలు జారీ చేసినారు. ఎండ తీవ్రత తీవ్రంగా ఉన్నందున వరి ధాన్యం కొలుగోలు ప్రాంతంలో రైతులకు మంచినీటి వసతి నీడ వసతులు కల్పించాలని నిర్వాహకులను ఆదేశించడం జరిగింది. వరి ధాన్యశీ ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని గ్రామ సర్పంచ్ మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు మందుగుల బాలకృష్ణ,వెంకంబావి తండ సర్పంచ్ పానుగోతు వసంత బాలు నాయక్, కంకణాలగూడెం మాజీ సర్పంచ్ సరిపల్లి శైలజ సత్యనారాయణ , వార్డ్ మెంబర్లు సూరపల్లి వెంకటేశం, మాజీ వార్డ్ నెంబర్ ఎండి ముస్తఫా ఖాన్, కాంగ్రెస్ నాయకులు గునిగంటి రాజు గౌడ్,అందే యాదయ్య యాదవ్, ఉప్పల రాజయ్య, కరెంటుతు లచ్చు నాయక్, సుర్వీ ముత్యాలు గౌడ్, బద్దుల యాదగిరి యాదవ్, ఎండి హర్షద్ ఎండి కురిసి, జక్కిడి వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరు ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలి

### బాధితురాలికి ఆర్థిక సహాయం



కేశంపేట, (క్రైమ్ మిర్రర్): నేటి సమాజంలో ప్రతి ఒక్క వ్యక్తి ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలని సర్పంచ్ స్వప్న భూపాల్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని పోమాల్ పల్లి గ్రామానికి చెందిన దన్నడి మంజుల యాదవ్ శేఖర్ యాదవ్ కు కొన్ని నెలలుగా అనారోగ్యానికి గురి కావడంతో సర్పంచ్ కోరిక మేరకు గాను సంగెం గ్రామానికి చెందిన ప్రసూన్ కన్స్ట్రక్షన్ అధినేత గోపాల్ రెడ్డి హాస్పిటల్ ఖర్చుల కోసం రూ20వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని గురువారం కుటుంబ సభ్యులైన మంజుల శేఖర్ యాదవ్ లకు సర్పంచ్ స్వప్న భూపాల్ రెడ్డి అందజేశారు.ఈ సందర్భంగా భూపాల్ రెడ్డి మాట్లాడుతు ప్రస్తుత పరిస్థితుల పట్ల అందరూ ఆరోగ్యం పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ఆర్థిక సహాయం చేసిన ఎన్నం గోపాల్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు నిదురం జంగయ్య యాదవ్,చాకలి అనిత కృష్ణ,నిదురం వరలక్ష్మి రోషయ్య యాదవ్,దాసరి యాదమ్మ నర్సింహా, నాయకులు బండ లక్ష్మి కృష్ణ,మీసాల సుజాత జగన్,పోలేపోగు శ్రీకాంత్,నిదురం మంగ కుమార్ యాదవ్,నిదురం మల్లేష్ యాదవ్,బండ జ్యోతి శేఖర్ యాదవ్,బావండ్ల లావణ్య రాజేశ్వర్ ముదిరాజ్,బుర్రి రంగారెడ్డి,నిదురం శేఖర్ యాదవ్,చీపిరి యాదయ్య యాదవ్,తదితరులు ఉన్నారు.

## వనస్థలిపురం పరిధిలో గంజాయి తరలిస్తుండగా ఇద్దరు అరెస్టు



**ఎల్బీనగర్ మే 7 క్రైమ్ మిర్రర్ ప్రతినిధి :** వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని బి.ఎన్.రెడ్డి నగర్ సాగర్ కాంప్లెక్స్ వద్ద బుధవారం రోజు సాయంత్రం సబ్ ఇన్స్పెక్టర్ నాగరాజు ఆధ్వర్యంలో వాహనాలు చెకింగ్ చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని ఆపే ప్రయత్నం చేయగా ఒక కవర్ను రోడ్డు పక్కన పడేసి తప్పించుకొని పారిపోతుండగా పోలీసులు పట్టుకొని తనిఖీ చేయగా కవర్లో గంజాయి లభించింది అని వనస్థలిపురం ఇన్స్పెక్టర్ రవిబాబు తెలిపారు.

క్రైమ్ మిర్రర్®
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు



# ఇదేమి ప్రజా పాలన!






## ముగ్గురు మంత్రులు జిల్లాకు లాభమా? శాపమా?

## రైతుల రోడ్డు ఎక్కుతుంటే రైతు వారోత్సవాలా?

## పంటలు కొనకుండా పండుగలేల?

## కళ్ళాల్లోనే ధాన్యం కుప్పలు

## ప్రభుత్వం వెంటనే స్పందించాలంటూన్న "బొంతు రాంబాబు"

**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలతో తెల్లారితే ఏ సమస్య వస్తుందో అని ప్రజలు సమస్యలతో తలడిల్లుతుంటే రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక పేరుతో పండుగలు చేసుకోటం సిగ్గుచేటుగా ఉందని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. గురువారం సాయంత్రం మండల పరిధిలోని కుర్నవల్లి గ్రామంలోని కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన ఆయన మాట్లాడుతూ ఒకవైపు రైతులు కోతలు పూర్తయి పండించిన ధాన్యం కళ్ళల్లో కుప్పలుగా ఉండగా రోజుకొకచోట అకాల వర్షం కురుస్తూ కంటికి కునుకు లేకుండా చేస్తుంటే రైతు కష్టాలు తీర్చాల్సిన ప్రభుత్వం వారోత్సవాలు పేరిట ఉత్సవాలు నిర్వహించడం ఎంతవరకు సమంజసం అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వంలో జిల్లాకు చెందిన వారి ముగ్గురు మంత్రులుగా ఉండటం జిల్లా ప్రజలకు లాభమా? శాపమా? అర్థం కాని పరిస్థితి జిల్లా ప్రజలకు నెలకొందని ఆయన యద్దేవా చేశారు క్షేత్రస్థాయిలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పంటల కొనుగోళ్లలో సర్కార్ ఆలస్యం రైతులకు శాపంగా మారిందన్నారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిన చోట కొనుగోళ్లు మొదలు పెట్టకపోవడం మొదలుపెట్టిన చోట కొర్రీలు కోతలతో జాప్యం చేస్తుండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా 20 రోజుల నుంచి నెలరోజుల పాటు కల్లాల్లోనే రైతులు పడిగాపులు కాస్తున్నారని, తామంతా రోడ్లపై అరిగోస పడుతుంటే..ఇదే సమయంలో పండుగలెలా చేస్తారు? అంటూ రైతులు మండిపడుతున్నారు.పంటలు కొనడం చేతగావడంలేదు గానీ.. పండుగలు చేయడానికి ఉత్సాహం చూపుతారా? అంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్నింటా నష్టాలు చవిచూస్తున్న రైతులు కష్టాలు,కన్నీళ్లతోనే ఉత్సవాల్లో పాల్గొనలా?అంటూ ఆయన ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు శీలం సత్యనారాయణ రెడ్డి, మండల అధ్యక్షులు కళ్యాణం కృష్ణయ్య మండల నాయకులు కట్టా దుర్గారావు, ఐలూరి రామిరెడ్డి, కట్టా కృష్ణారావు, దూల పుల్లయ్య, రైతులు పాల్గొన్నారు.

## భర్తతో వీడియో కాల్ మాట్లాడుతూ ఈరమల్ల అరుణ అనే మహిళ ఆత్మహత్య



**ఎల్బీనగర్ మే 7 క్రైమ్ మిర్రర్ ప్రతినిధి :** భర్తతో వీడియో కాల్ మాట్లాడుతూ మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సాహెబ్ నగర్ లో నివాసం ఉంటున్న ఈరమల్ల అరుణ, రమేష్ దంపతులు. గురువారం రమేష్ ఊరికి వెళ్తాను తన భార్య అరుణకు చెప్పగా ఆమె ఊరికి వెళ్లొద్దు పనికి వెళ్లాలి అని వీడియో కాల్ లో చెప్పింది అతనితో ఫోన్లో మాట్లాడుతుండగానే ఉరి వేసుకుని చనిపోయింది. తన కొడుకు విక్రాంత్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాము అని, మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం ఉస్మానియా హాస్పిటల్ కు తరలించాము అని ఇన్స్పెక్టర్ రవిబాబు తెలిపారు.

## 99 రోజుల ప్రభుత్వ ప్రగతి ప్రణాళిక

**సోలార్ విద్యుత్ పై విద్యుత్ మరియు వ్యవసాయ అధికారులతో అవగాహన సదస్సు**





**చిట్యాల క్రైమ్ మిర్రర్:** చిట్యాల మండలం గుండ్రంపల్లి రైతు వేదికలో 99 రోజుల ప్రభుత్వ ప్రగతి ప్రణాళిక భాగంగా కుసుమ సోలార్ విద్యుత్ పై విద్యుత్ మరియు వ్యవసాయ అధికారులతో అవగాహన సదస్సు రైతులకు సోలార్ పంప్ సెట్ లో ప్రభుత్వ సబ్సిడీ మరియు రైతులు నేరుగా సోలార్ విద్యుత్ ప్లాంటులను పెట్టుకుంటే నేరుగా విద్యుత్ సంస్థలు కొనుగోలు చేస్తాయి దీనివల్ల రైతులకు ఆదాయం సమకూరుతుంది విద్యుత్ అధికారులు తెలియజేసినారు సర్పంచులు మాట్లాడుతూ గ్రామ పంచాయతీలకు అధికంగా విద్యుత్ బిల్లు వస్తున్నందున సోలార్ వినియోగించడం వల్ల విద్యుత్ బిల్లునుండి పూర్తిగా తగ్గించుకోవచ్చును ఎలాంటి అవకాశాలు ఉన్నా గ్రామపంచాయతీ రెవెన్యూ పరిధిలో భూముల్లో కానీ గ్రామపంచాయతీల పైన గాని ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం మరియు అధికారులు సహకరించాలని సర్పంచ్లు అందరు కోరినారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ నర్రా వినోదమోహన్ రెడ్డి మున్సిపల్ చైర్మన్ పందిరి గీతా రమేష్ వైస్ చైర్మన్ గుండెబోయిన లక్ష్మి సైదులు సర్పంచుల ఫోరం అధ్యక్షులు కాటశీ వెంకటేశం సర్పంచులు బొంతల చంద్రారెడ్డి గుండ్రంపల్లి సర్పంచ్ లక్ష్మీ ప్రసన్న కట్ట ఆశయ శ్యామ్ అందే రాములు విద్యుత్ ఏ ఈ అగ్రికల్చర్ ఏవో గిరిబాబు మండల పార్టీ అధ్యక్షులు లక్ష్మీ నరసింహ ఉపసర్పంచ్ వరుస సైదులు రైతులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## క్షణికావేశాలతో నేరాలకు పాల్పడితే కఠినమైన జైలు శిక్షలు తప్పవు

**సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ ఐపిఎస్ హెచ్చరించారు.**



**కోదాడ మే 07 క్రైమ్ మిర్రర్ :** కోదాడ పట్టణంలో బస్టాండ్ ఎదురుగా జరిగిన మహిళ హత్యకు సంబంధించి ఘటన స్థలాన్ని ఈరోజు డిఎస్పి శ్రీనివాస్ రెడ్డి స్థానిక ఇన్స్పెక్టర్ శివశంకర్ పోలీస్ అధికారులతో కలిసి ఎస్పీ నరసింహ ఐపీఎస్ పరిశీలించారు. సంఘటన జరిగిన చోట దుకాణదారులను ఆరా తీశారు, సంఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. నిందితులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని, రిమాండ్ కు తరలించాలని తెలిపారు, జైలు శిక్ష పడేలా దర్యాప్తు చేసి సాక్షులను బాధితులను విచారించి నేరాభియోగ పత్రాలను కోర్టుకు దాఖలు చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సమస్యలు ఉంటే సమరయస్యంగా పరిష్కరించుకోవాలని క్షణికావేశంతో తప్పులు చేసిన వివాదాలకు పాల్పడిన నేరాలు చేసిన చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. చట్టాలు బలోపేతం చేయబడ్డాయని, కేసుల్లో సాంకేతికతతో వేగవంతమైన దర్యాప్తు చేస్తున్నామని అన్నారు. ఈ సంఘటనకు సంబంధించి వేగంగా దర్యాప్తు చేసి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఇలాంటి సంఘటనలకు పాల్పడేవారు ఎంతటి వారైనా పోలీస్ శాఖ ఉపేక్షించమని చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.ఎస్పీ వెంట స్థానిక డిఎస్పి శ్రీనివాసరెడ్డి, కోదాడ పట్టణ ఇన్స్పెక్టర్ శివశంకర్, ఎస్సై సుధీర్ పోలీస్ సిబ్బంది ఉన్నారు.

# అభివృద్ధికి సహకరించండి.. అండగా ఉంటాం

- చెన్నూరులో రోడ్డు విస్తరణ పై బాధితులతో మంత్రి చర్చలు
- 55 అడుగుల వరకే రోడ్డు విస్తరణ.. బాధితులకు టీడీఆర్, కొత్త దుకాణాల కేటాయింపు
- రైతులు ఆందోళన చెందవద్దు.. తడిసిన ధాన్యాన్నీ కొనుగోలు చేస్తాం
- కేటీఆర్ ఒక ఫెయిల్యూర్ నాయకుడు: మంత్రి వివేక్ వెంకటస్వామి

**చెన్నూరు, మే 7 (క్రైమ్ మిర్రర్):** చెన్నూరు పట్టణ రూపురేఖలను మార్చేందుకు చేపట్టిన రోడ్డు విస్తరణ పనులకు ప్రజలు, వ్యాపారులు పూర్తిస్థాయిలో సహకరించాలని రాష్ట్ర కార్మిక, మైనింగ్ శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి కోరారు.గురువారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు.పట్టణ సమగ్ర అభివృద్ధి, రైతు సంక్షేమంపై ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ఈ సందర్భంగా వివరించారు. రోడ్డు విస్తరణలో ఎవరికీ ఇబ్బంది కలగకుండా ప్రభుత్వం తగిన జాగ్రత్తలు తీసుకుంటోందని మంత్రి భరోసా ఇచ్చారు. "అధికారులు తొలుత 60 అడుగుల విస్తరణకు ప్రతిపాదించినా,వ్యాపారుల అభ్యర్థన మేరకు దానిని 55 అడుగులకు పరిమితం చేశాం. బాధితులతో అనేకసార్లు చర్చించిన తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నాం.విస్తరణలో షాపులు, స్థలాలు కోల్పోయిన వారికి టీడీఆర్ ఇవ్వడంతో పాటు, మున్సిపాలిటీలో కొత్తగా నిర్మించే షాపింగ్ కాంప్లెక్స్‌లో దుకాణాలను కేటాయిస్తాం" అని స్పష్టం చేశారు. ఇప్పటికే పలువురు వ్యాపారులు




స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సహకరిస్తున్నారని, గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బాధితులకు ఎలాంటి నష్టపరిహారం అందలేదని విమర్శించారు. చివరి గింజ వరకు ప్రభుత్వమే కొంటుంది.ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రానివ్వబోమని మంత్రి హామీ ఇచ్చారు. నియోజకవర్గంలో ఇప్పటివరకు 2 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాం. హమాలీల కొరత, ఎండ తీవ్రత వల్ల కొంత జాప్యం జరుగుతున్నా రోజుకు సుమారు 100 లారీల ద్వారా రవాణా సాగుతోందని వెల్లడించారు.వర్షాలకు తడిసిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామన్నారు. ఎంపీ వంశీకృష్ణ ప్రత్యేక చొరవతో కేంద్రం నుంచి అనుమతులు పొంది, నియోజకవర్గంలో మరో 15 రోజుల పాటు అదనంగా పత్తి కొనుగోళ్లు చేపట్టినట్లు తెలిపారు.

**కేటీఆర్ ఒక ఫెయిల్యూర్ నాయకుడు**

ఎన్నికల్లో ఓటమి పాలైన నిరాశతోనే ప్రతిపక్ష నేతలు ప్రభుత్వంపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని మంత్రి మండిపడ్డారు. కేటీఆర్ ఒక ఫెయిల్యూర్ నాయకుడని ఎద్దేవా చేస్తూ.. కాళేశ్వరం బ్యాక్‌వాటర్ బాధితులను గత ప్రభుత్వం పట్టించుకోకపోయినా, తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటికే రెండుసార్లు పరిహారం అందించామని గుర్తు చేశారు. గత ఎమ్మెల్యే డబుల్ బెడ్రూం ఇళ్లు కట్టించలేదని,ఇప్పుడు తాము పట్టాలు ఇస్తుంటే క్రెడిట్ తీసుకోవడం హాస్యాస్పదమని పేర్కొన్నారు.ఈ ఏడాది కూడా రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోళ్లు చేపట్టి రైతులకు అండగా నిలుస్తామని మంత్రి స్పష్టం చేశారు.

## సీనియర్ అసిస్టెంట్లకు సూపరింటెండెంట్లుగా పదోన్నతి

**నల్లగొండ నిఘా ప్రతినిధి(క్రైమ్ మిర్రర్):** తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ డి.దివ్య జోన్-5 పరిధిలోని, పదిమంది సీనియర్ అసిస్టెంట్లకు సూపరింటెండెంట్లుగా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణ రాష్ట్ర సబార్డినేట్ సర్వీస్ నిబంధనల ప్రకారం, తాత్కాలిక ప్రాతిపదికన ఈ నియామకాలు చేపట్టారు. పదోన్నతి పొందిన వారిలో కె.శివానందం (నల్గొండ), బి.కృష్ణవేణి (సూర్యాపేట), ఎం.జ్యోతి (నల్గొండ), బి.పార్వతి (నల్గొండ), దేవదానం (సూర్యాపేట), కె.వి.దుర్గా ప్రసాద్ (సూర్యాపేట), వి.శరత్ చంద్రరావు (యాదాద్రి భువనగిరి), నూల కమలాకర్ (జనగామ), కె.మహేందర్ (సూర్యాపేట), మరియు ఇ.శ్రీనివాస్ రెడ్డి (యాదాద్రి భువనగిరి) ఉన్నారు. వీరికి నెలకు 42,300 నుండి 1,15,270 వరకు, వేతన శ్రేణి వర్తించనుందని తెలిపారు. ఈ పదోన్నతి పొందిన అభ్యర్థులు ఉత్తర్వులు అందిన, 15 రోజుల లోపు సంబంధిత జిల్లాలలో విధుల్లో చేరాలని, లేని పక్షంలో పదోన్నతి హక్కును కోల్పోతారని కమిషనర్ స్పష్టం చేశారు. ఎవరిపైనైనా క్రమశిక్షణ చర్యలు, ఇతర కేసులు పెండింగ్‌లో ఉంటే అటువంటి వారికి ఈ పదోన్నతి ఉత్తర్వులను వర్తింపజేయకూడదని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ నియామకాలు పూర్తిగా తాత్కాలికమని, కోర్టులో ఉన్న వివిధ కేసుల తుది తీర్పులకు లోబడి ఉంటాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రభుత్వం నుండి వచ్చే స్పష్టతలకు అనుగుణంగా ఈ నియామకాలలో మార్పులు ఉండవచ్చన్నారు.



GOVERNMENT OF TELANGANA
PROCEEDINGS OF THE COMMISSIONER OF PANCHAYAT RAJ AND RURAL DEVELOPMENT: ANAND NAGAR COLONY, KHAIRATABAD, HYDERABAD-04

Present: D.Divya, I.A.S.,
Commissioner, PR&RE

Procs.No.34022/C1/SA to Supdts-V/CPR&RE/2024 Dated:01.05.2026

Sub:- CPR&RE - Establishment - ZPP unit - Zone-V - Appointment by promotion to the post of Superintendents in ZPP Unit from the feeder category on temporary basis and posted to the Districts in concerned Zone - Orders - Issued.

Read:- 1. G.O.Ms.No.124, GA (SPF-MC) Dept., Dt.30.08.2018.
2. G.O.Ms.No.128, GA (SPF-I) Dept., Dt.30.06.2021.
3. G.O.Ms.No.204, GA (SPF-II) Dept., Dt.04.08.2021.
4. G.O.Ms.No.44, GA (Ser.D) Dept., Dt.19.03.2022.
5. Confirmed Seniority lists of Senior Assistants
6. Memo No.34022/C/SA to Supdt./CPR&RE/2024, 29.07.2025.
7. Information received from the CEOs,ZPP concerned
****

ORDER:

Under Rule 10 (a) of Telangana State and Sub-ordinate Service Rules, 1996 (adopted), the following Senior Assistants of ZPP Unit are hereby appointed by promotion to the post of Superintendents of ZPP Unit in Zone-V on temporary basis in the time scale of Rs.42300-1190-44680-1280-48520-1400-52720-1500-57220-1630-62110-1730-67300-1850-72850-1990-78820-2140-85240-2270-92050-2420-99310-2560- 106990-2760-115270 and posted to Districts as shown against their names at Col.No.(5) in the existing vacancy in concerned Zone.

| Sl. No. | Cadre | Name | Present place of working & Dist | Caste | Allotted district |
|---|---|---|---|---|---|
| 1 | Sr.Asst | K.Shivanandam | MPP Gundlapally | SC- (HH) 100 % | Nalgonda |
| 2 | Sr.Asst | B. Krishnaveni | PR, SD, Huzur[illegible] | ST | Suryapet |
| 3 | Sr.Asst | M. Jyothi | MPP Nalgonda | ST | Nalgonda |
| 4 | Sr.Asst | B.Parvathi | MPP Nampally | ST | Nalgonda |
| 5 | Sr.Asst | Devadanam | MPP Chinthapally | SC | Suryapet |
| 6 | Sr.Asst | K.V.Durga Prasad | MPP Huzurnagar | BC-D | Suryapet |
| 7 | Sr.Asst | V.Sharath Chandra Rao | ZPP Yadadri Bhuvangir | OC | Yadadri Bhongir |
| 8 | Sr.Asst | Noola Kamalakar | MPP Ramannapet | BC-D | Jangaon |
| 9 | Sr.Asst | K. Mahender | Dy.EE, R.W.S.M.B(Intra) Nakerekal | OC | Suryapet |
| 10 | Sr.Asst | E.Srinivas Reddy | MB Intra RWS & S Divi, Bhongir | OC | Yadadri Bhongir |

The above appointment is purely temporary subject to the following conditions:-

cc) That the appointment is purely temporary and is likely to be reverted back to his/her respective feeder category at any time without any prior notice and without assigning any reasons, as and when administrative exigency arises.

## అంతరాష్ట్ర సరిహద్దు చెక్పోస్ట్ తనిఖీ చేసిన ఎస్పీ నరసింహ ఐపీఎస్

**అంతరాష్ట్ర సరిహద్దులో క్షుణ్ణంగా పోలీస్ తనిఖీలు... సూర్యాపేట జిల్లా ఎస్పీ.**



**కోదాడ మే 07 క్రైమ్ మిర్రర్:** తెలంగాణ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ముఖ్య వారధిగా ఉన్న జాతీయ రహదారి 65 పై కోదాడ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో రామాపురం వద్ద ఏర్పాటుచేసిన అంతరాష్ట్ర సరిహద్దు చెక్పోస్ట్ ను ఈరోజు జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ పరిశీలించారు. వరి ధాన్యం, ప్రభుత్వ పంపిణీ బియ్యం, పశువుల రవాణా, మద్యం, ఇసుక, ఇతర నిషేధిత వస్తువుల అక్రమ రవాణా నిర్మూలించడంలో భాగంగా తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల ముఖ ద్వారమైన సూర్యాపేట జిల్లా రామాపురం వద్ద అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్ పోస్ట్ ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఈ చెక్ పోస్ట్ నందు పోలీసు సిబ్బంది రెవెన్యూ ఇతర శాఖల సిబ్బంది 24 గంటలు అప్రమత్తంగా ఉంటూ ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నారని అక్రమ రవాణా అసాంఘిక కార్యకలాపాలను నిర్మూలించడంలో పటిష్టంగా పనిచేస్తున్నామని ఎస్పీ తెలిపారు. చెక్పోస్ట్ వద్ద ఎలాంటి ప్రమాదాలు సంభవించకుండా జాగ్రత్తలు పాటించాలని సిబ్బందికి కావలసిన సదుపాయాలను ఏర్పాటు చేయాలని అధికారులను ఎస్పీ ఆదేశించారు. చెక్పోస్ట్ నందు విధులు నిర్వహిస్తున్న సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉంటూ సామాన్య ప్రజానీకానికి సామాన్య ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తనిఖీలు క్షుణ్ణంగా నిర్వహించాలని సూచించారు. రెండు రాష్ట్రాల మధ్య ఎలాంటి అక్రమ రవాణా జరగకుండా ఈ సరిహద్దు చెక్పోస్ట్ నందు పటిష్టమైన నిగా ఉంచామని అన్నారు. ఆంధ్ర రాష్ట్రంలో పండిన వరి ధాన్యాన్ని తెలంగాణకు వచ్చి అమ్మకుండా గా ఉంచామని ఎవరైనా ఇలాంటి వాటికి పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటున్నామని. ఎస్పీ వెంట డిఎస్పి శ్రీనివాస్ రెడ్డి, అనంతగిరి ఎస్సై నవీన్, ట్రాఫిక్ ఎస్ఐ అంజిరెడ్డి, చెక్ పోస్ట్ సిబ్బంది ఉన్నారు.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.